ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గరిష్ఠం 29.0
కనిష్ఠం 23.0
యాదాద్రి భువనగిరి
5
శుక్రవారం 24 అక్టోబరు 2025

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	587.20 (305.6242)	48,778	48,778
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.60 (4.36)	1976.02	1420.02
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	174.309 (43.548)	13,110	37,847


చికెన్ ధరలు | లైవ్ : రూ.148 | డ్రెస్ : రూ.220 | స్కిన్‌లెస్ : రూ.250

రెట్టించని కిక్కు

మద్యం దుకాణాల లైసెన్స్‌కోసం దరఖాస్తుల స్వీకరణ గడువు గురువారంతో ముగిసింది. ప్రభుత్వం రెట్టింపు స్థాయిలో దరఖాస్తులు వస్తాయని ఆశించినా, ఫలితం దక్కలేదు. ఐదు రోజులపాటు గడువు పొడిగించినప్పటికీ ఈ నెల 18వరకు వచ్చిన దరఖాస్తుల కంటే అదనంగా 129 దరఖాస్తులు అందాయి. ఈ దరఖాస్తుల ద్వారా ప్రభుత్వానికి రూ.3.87కోట్ల ఆదాయం సమకూరింది.

(ఆంధ్రజ్యోతి-యాదాద్రి)

- జిల్లాలో మొత్తం 82 దుకాణాలకు 2,776 దరఖాస్తులు
- ప్రభుత్వానికి చేకూరిన ఆదాయం రూ.83.28కోట్లు
- దరఖాస్తుల స్వీకరణకు ముగిసిన గడువు
- ఈ నెల 27న లక్కీ డ్రా... రెండేళ్ల వరకు లైసెన్సు



ప్రభుత్వం గతంలో విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం ఈ నెల 18వ తేదీతో గడువు ముగిసింది. ఆ రోజు బీసీ జేఏసీ ఆధ్వర్యంలో బంద్‌కు పిలుపునివ్వడంతోపాటు శనివారం కావడంతో బ్యాంకులు కూడా కొన్ని పనిచేయలేదు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి పొద్దుపోయే వరకూ దరఖాస్తులను జిల్లాయంత్రాంగం స్వీకరించింది. హడావుడిలో ఇంకా కొంతమంది వ్యాపారులు దరఖాస్తు చేసుకోలేదన్న ఉద్దేశ్యంతో ఈ నెల 23వ తేదీ వరకు మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం గడువు పొడిగించింది. గురువారంతో గడువు ముగియడంతో చివరిరోజు కూడా ఆసక్తి ఉన్న మద్యం వ్యాపారులు దరఖాస్తు చేసుకున్నారు. జిల్లాలో 82 దుకాణాలకు దాదాపు 2,776 దరఖాస్తులు అందాయి. ఈ దరఖాస్తుల ద్వారా ప్రభుత్వానికి రూ.83.28కోట్ల ఆదాయం సమకూరింది.

27 నుంచి నూతన మద్యం విధానం

ఈ నెల 27న లక్కీ డ్రా తీసిన అనంతరం నూతన మద్యం విధానం (ఎక్సైజ్ పాలసీ)అమలు కానుంది. షాపుల లైసెన్సులకు ప్రభుత్వం కొత్త ఫీజులను ప్రకటించింది. ఈ మేరకు లైసెన్సు ఫీజులను నిర్ధారిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మద్యం దుకాణాలకు లైసెన్సులను కొత్త పాలసీ ప్రకారం రెండేళ్ల వరకు ఇవ్వాలని నిర్ణయించింది. జిల్లాలో మొత్తం 82 దుకాణాలకు 16 దుకాణాలకు సంవత్సరానికి రూ.60లక్షలు, 46 దుకాణాలకు రూ.55లక్షలు, 20 దుకాణాలకు రూ.50లక్షల స్లాబ్‌లను నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వం నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. వ్యాపారులు దరఖాస్తు చేసుకునేందుకు రద్దీ లేకుండా ఉండేందుకు జిల్లాయంత్రాంగం సంబంధిత పోలీసుస్టేషన్ల పరిధిలో ప్రత్యేకంగా కౌంటర్లను ఏర్పాటు చేసింది. గురువారంరాత్రి వరకు వచ్చిన దరఖాస్తులను స్వీకరించారు. జిల్లాలో మొత్తం 82 మద్యం షాపులు ఉన్నాయి. వీటిలో భువనగిరి ఆబ్కారీ పోలీస్‌స్టేషన్ పరిధిలో 27, రామన్నపేట స్టేషన్ పరిధిలో 18, ఆలేరు స్టేషన్ పరిధిలో 22, మోత్కురు స్టేషన్ పరిధిలో 15 ఉన్నాయి. జిల్లాయంత్రాంగం 2025-27 సంవత్సరాలకు దుకాణాలకు సంబంధించిన లైసెన్స్‌ల కోసం దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పూర్తి చేసింది. జిల్లాలో 2023-25 మద్యం దుకాణాల రిజర్వేషన్ల కేటాయింపుల్లో భాగంగా మొత్తం 82 దుకాణాలకు రాష్ట్రం యూనిట్‌గా 29 దుకాణాలు ఆయా సామాజికవర్గాలకు కేటాయించారు. జిల్లాలో గౌడ్‌లు 15 శాతం(21 దుకాణాలు), ఎస్సీలకు 10శాతం (7దుకాణాలు), ఎస్టీలకు 5శాతం (ఒక దుకాణం) కేటాయించారు. ఈ సంవత్సరం కూడా గతంలోనే మాదిరిగానే రిజర్వేషన్లను కేటాయించి, ఆయా దుకాణాల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. జిల్లాలోని 39వ నెంబరు (ఎల్లంబావి) మద్యం దుకాణానికి అత్యధికంగా 91 దరఖాస్తులు, 80వ నెంబరు (అరూరు) దుకాణానికి 83 దరఖాస్తులు అందాయి.

జిల్లా	దరఖాస్తులు	ఆదాయం
యాదాద్రి	2776	రూ.83.28కోట్లు
నల్లగొండ	4905	రూ.147.15కోట్లు
సూర్యాపేట	2758	రూ.82.74కోట్లు
మొత్తం	10,452	రూ.313.56కోట్లు

వ్యాపారుల సిండికేట్

వ్యాపారులు సిండికేట్‌గా మారి మద్యం దుకాణాలకు టెండర్ వేశారు. టెండర్లలో పాల్గొనేందుకు పాత వ్యాపారులే.. మరికొంత మంది కొత్త వారిని చేర్చుకున్నారు. దరఖాస్తుల రుసుము గతం కంటే మరో రూ.లక్ష పెరగడంతో వ్యాపారులు చేతులు కలిపి టెండర్ దరఖాస్తు చేసుకున్నారు. ఒక్కరిపైనే ఆర్థిక భారం పడకుండా గుంపులుగా కలిసి టెండర్లలో పాల్గొన్నారు. కనీసం 5 నుంచి 10 మంది, 15 మంది, 20మంది చొప్పున గ్రూపులుగా ఏర్పడి, షాపులవారీగా చర్చించుకుని రింగ్‌గా మారి దరఖాస్తులు వేసినట్లు సమాచారం. జిల్లావ్యాప్తంగా డిమాండ్ ఉన్న షాపులకు కనీసం 25 నుంచి 48 దరఖాస్తులు అందాయి.

దరఖాస్తుల ద్వారా 83.28కోట్ల ఆదాయం

జిల్లాలో 82దుకాణాలకు దాదాపుగా 2,776 దరఖాస్తులు అందాయి. ఈ దరఖాస్తుల ద్వారా ప్రభుత్వానికి రూ.83.28కోట్ల ఆదాయం సమకూరింది. గతంలో 3,900 దరఖాస్తులు అందాయి. ప్రభుత్వానికి రూ.78కోట్ల మేర ఆదాయం సమకూరింది. గతంతో పోలిస్తే ఈ సారి 1,124 దరఖాస్తులు తగ్గాయి. జిల్లాలో ఈ నెల 18వ తేదీ వరకు 82 మద్యం దుకాణాలకు 2,647 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుల... మిగతా 8వ పేజీలో..

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

- కలెక్టరేట్ ఎదుట వంట కార్మికుల నిరసన



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న వంట కార్మికులు

భువనగిరి (కలెక్టరేట్), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఐదు నెలల మధ్యాహ్న భోజన బిల్లులు చెల్లించి, వేతనాలు విడుదల చేయాలని వంట కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏఐటీయూసీ నాయకులతో కలిసి వంట కార్మికులు గురువారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపి, కలెక్టర్ హనుమంతరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వంట కార్మికులు మాట్లాడుతూ మెనూ ప్రకారం భోజనం తయారు చేయాలని చెబుతూ బిల్లులు చెల్లించడంలో విద్యాశాఖ విఫలమైందని ఆరోపించారు. ఐదు నెలలుగా బిల్లులు చెల్లించకపోతే మధ్యాహ్న భోజనం ఎలా పెడతామని ప్రశ్నించారు. వెంటనే మార్కెట్ ధరలకు అనుగుణంగా మెను చార్జీలు పెంచి, రూ.10వేల గౌరవ వేతనం ఇవ్వాలన్నారు.

గీత కార్మికులంతా ఐక్యం కావాలి

మోటకొండూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రంలోని గీత కార్మికులంతా ఐక్యం కావాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొలగాని జయరాములు అన్నారు. గురువారం మండల కేంద్రంలో కల్లుగీత కార్మిక సంఘం మండల నాలుగో మహాసభలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాలు చిత్తశుద్ధితో కల్లుగీత కార్మికుల సంక్షేమానికి బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించి, ప్రతి ఇంటికీ రూ.రెండు లక్షల సబ్సిడీ రుణాలు ఇవ్వాలన్నారు. అనంతరం సంఘం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి దూపాటి వెంకటేష్, ఆలేరు మార్కెట్ వైస్ చైర్మన్ పశ్చిమట్ల మదార్‌గౌడ్, డైరెక్టర్ తండ పాండురంగయ్యగౌడ్, బాలరాజు, కృష్ణంరాజు, కోల కృష్ణ, వంగాల చంద్రమౌళిగౌడ్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేవరకూ పోరాటం

- సీపీఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి



తహసీల్దార్ ఆంజనేయులుకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆలేరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రభుత్వం పరిష్కరించేవరకూ సీపీఐ వారికి అండగా ఉండి ఉద్యమిస్తుందని పార్టీ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొలనుపాక గ్రామానికి చెందిన అర్హులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని తహసీల్దార్ కార్యాలయం ఎదుట చెక్క వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. ఆరు నెలలుగా ఆందోళనలు నిర్వహిస్తున్నా పట్టించుకోకపోవడం సరికాదన్నారు. కార్పొరేట్ కంపెనీలకు వందల ఎకరాలు కట్టబెడుతున్న ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలను కేటాయించకపోవడం సరికాదన్నారు. అనంతరం తహసీల్దార్ ఆంజనేయులుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి కనకయ్య, నాయకులు ప్రవీణ్, లబ్ధిదారులు భవాని, పార్వతీ, సంపత్, యాదమ్మ, సుశీల, సరిత, సంధ్య, లక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి : డీఈవో



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో సత్యనారాయణ

అడ్డగూడూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదవాలని డీఈవో సత్యనారాయణ అన్నారు. అడ్డగూడూరు మండలంలోని కోటమర్తి, డి.రేపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను గురువారం డీఈవో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఏర్పరుచుకొని ముందుకు సాగాలన్నారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో నర్ర సబిత, ఎల్‌డీఏ కాంత్రి కుమార్, హెచ్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారి కఠినంగా శిక్షించాలి

- బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు పాశం భాస్కర్



భువనగిరిలో ఎంఐఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

భువనగిరి టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రశాంత్‌సింగ్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు పాశం భాస్కర్ అన్నారు. గోరక్షకుడు ప్రశాంత్‌సింగ్ సోనుపై కాల్పులను ఖండిస్తూ గురువారం భువనగిరిలో బీజేపీ ఆధ్వర్యంలో ఎంఐఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌పాలనలో గోవులు, వాటి రక్షకులకు భద్రత కరువైందన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు రత్నపురం బలరాం, నాయకులు పడమటి జగన్‌మోహన్‌రెడ్డి, సుర్వి శ్రీనివాస్‌గౌడ్, చందా మహేందర్‌గుప్తా, జెన్నపల్లి శ్యాంసుందర్‌రెడ్డి, పట్నం శ్రీనివాస్, ఎ వైజయంతి, కోళ్ల భిక్షపతి, పట్నం కపిల్, రాళ్లబండి కృష్ణాచారి, ఉడుత భాస్కర్, కొల్లోజు శ్రవణ్, ఉషాకిరణ్ పాల్గొన్నారు.

ఆలేరు: గోరక్షకుడిపై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని బీజేపీ నేతలు డిమాండ్ చేశారు. దాడిని ఖండిస్తూ ఆలేరులో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి ప్రభుత్వానికి వ్యతిరేక నినాదాలు చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు కుమారస్వామి, నంద గంగేష్, నాయకులు సృజన్‌కుమార్, వెంకటేష్, కృష్ణ, వడ్డేమాన్ నరేందర్, ఐడియా శ్రీనివాస్, దశరథ, కిషన్ పాల్గొన్నారు.

పార్శిళ్లపై పట్టింపేదీ?

- ఆర్టీసీ కొరియర్ సర్వీస్‌పై వినియోగదారుల విస్మయం

ప్రజారవాణా వ్యవస్థలో అత్యంత కీలకమైనది ఆర్టీసీ. ఆర్టీసీ బస్సుల్లో నిత్యం ఎంతోమంది పార్శిళ్లను పంపిస్తున్నారు. అవి వినియోగదారులకు సురక్షితంగా అందితే సరి.. లేదంటే ఇబ్బందులు తప్పవు. పార్శిళ్ల నిర్వహణపై కొరియర్ యాజమాన్యం నిర్లక్ష్యం వ్యవహరిస్తోందని వినియోగదారులు ఆరోపిస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి-భువనగిరి టౌన్)



భువనగిరి బస్టాండ్‌లో రోడ్డు పక్కనే వేసిన పార్శిళ్లు

ప్రైవేట్ సంస్థలు ఏఎన్ఎల్ పేరిట బస్టాండ్ల కేంద్రంగా నిర్వహించే కొరియర్ సర్వీస్‌ను సుమారు రెండేళ్ల క్రితం ఆర్టీసీనే సొంతంగా నిర్వహిస్తోంది. ఇందుకోసం ప్రత్యేకంగా సిబ్బందిని నియమించారు కూడా. కొద్దిరోజులపాటు సక్రమంగానే సాగింది. కానీ తిరిగి కొరియర్ సేవలను ప్రైవేట్ ఏజెన్సీకే అప్పగించింది. ఈ నేపథ్యంలో భువనగిరి బస్టాండ్ ప్రాంగణంలో ఓ మూలన పార్శిల్ సర్వీస్ కేంద్రాన్ని నిర్మించి నిర్వహణను ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించారు. అయితే ఈ సర్వీస్ కేంద్రం నిర్వహణపై వినియోగదారులు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. తామందించే పార్శిళ్లను సక్రమంగా భద్రపరచడం లేదని, తమకు వచ్చే పార్శిళ్ల నిర్వహణలోనూ ఇదే పరిస్థితి నెలకొందని అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. విలువైన, సున్నితమైన వస్తువులను ఇస్తున్నప్పటికీ రోడ్డు పక్కనే పెడుతున్నారని, సేవల నిర్వహణలో సమయం పాటించడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు శ్రద్ధ చూపాలని వినియోగదారులు అంటున్నారు. అయితే పార్శిల్ సర్వీస్ కేంద్రానికి కేటాయించిన స్థలంలోనే తాత్కాలిక ప్రాతిపదికన ఓ దుకాణ ఏర్పాటుకు ఆర్టీసీ అధికారులు అనుమతులు ఇవ్వడం కూడా కారణమవుతున్నదని పలువురు అంటున్నారు.

ప్రతీ రోజు 300 పార్శిళ్లు

ప్రతీరోజు 150 పార్శిళ్లు భువనగిరికేంద్రంగా బస్సులద్వారా ఇతర ప్రాంతాలకు పంపుతున్నారు. అదే సమయంలో ఇతర ప్రాంతాల నుంచి భువనగిరికి 150కి పైగా పార్శిళ్లు వస్తుంటాయి. వినియోగదారుల, బస్సుల రాకపోకల సమయానికి.. మిగతా 8వ పేజీలో..

పెండింగ్ డీఏ, పీఆర్సీ సాధిస్తాం : శ్రీపాల్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

భువనగిరి టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉపాధ్యాయులకు రావాల్సిన పెండింగ్ బకాయిలు, డీఏ, పీఆర్సీని త్వరలో సాధిస్తామని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. గురువారం భువనగిరిలో జరిగిన పీఆర్టీయూటీఎస్ జిల్లా సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. డిమాండ్ల సాధనకు ప్రభుత్వాన్ని ఒప్పిస్తామని, అవసరమైతే ఆందోళనలకు ఉపాధ్యాయులు సిద్ధంగా ఉండాలన్నారు. విద్యా వ్యవస్థను మెరుగుపరిచేందుకు ప్రభుత్వానికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని, అదే సమయంలో ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని కాపాడుతామన్నారు. ప్రాథమిక పాఠశాలల సమస్యలకు పరిష్కరిస్తూనే సీపీఎస్ రద్దు కోసం పోరాటం చేస్తామన్నారు. విశ్రాంత ఉపాధ్యాయులకు రావాల్సిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ త్వరగా అందేలా కృషి చేస్తామన్నారు. సమావేశంలో పీఆర్టీయూ రాష్ట్ర, జిల్లా నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'ఉద్యోగవాణి'ని సద్వినియోగం చేసుకోవాలి



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

- కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి (కలెక్టరేట్), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ శాఖల్లో అటెండర్ స్థాయి నుంచి జిల్లా అధికారి వరకు విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఉద్యోగవాణి ప్రారంభించామని కలెక్టర్ హనుమంతరావు తెలిపారు. ప్రతీ గురువారం ప్రజాదర్బార్‌లో భాగంగా ఉద్యోగవాణి కార్యక్రమం ఉంటుందని, ఉద్యోగులు తాము ఎదుర్కొంటున్న శాఖాపరమైన సమస్యలు, ఇతర వ్యక్తిగత విషయాలను లిఖితపూర్వకంగా తెలియజేయవచ్చన్నారు. ఉద్యోగులు వారి ఉన్నతాధికారి అనుమతితో మాత్రమే ఉద్యోగవాణికి హాజరుకావాలని, డిప్యుటేషన్లు, బదిలీలకోసం అర్జీలను సమర్పించరాదని సూచించారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే ధ్యేయమని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో అర్జీలు స్వీకరించి మాట్లాడారు. ప్రజాదర్బార్‌లో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

యూనిటీ మార్చ్ పోస్టర్ ఆవిష్కరణ

కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించే సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి వేడుకలను జిల్లాలో ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. నవంబర్ 26న నిర్వహించే జాతీయస్థాయి మహా ఐక్యతా పాదయాత్ర యూనిటీ వాల్‌పోస్టర్లను జిల్లా క్రీడల అధికారి ధనంజనేయులుతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో మైభారత్ నల్లగొండ ఇన్‌చార్జి రాజేష్, అంబేద్కర్ పాల్గొన్నారు.

తూకం వేయగానే మిల్లులకు తరలించాలి

యాదగిరిగుట్ట రూరల్: రైతుల ధాన్యం తూకం వేయగానే మిల్లులకు తరలించాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. గురువారం మండలంలోని మల్లాపురం గ్రామంలో ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీచేశారు. కేంద్రంలో విద్యుత్ సౌకర్యంలేదని రైతులు కలెక్టర్ దృష్టికి తేగా, వెంటనే ట్రాన్స్‌కో ఏఈకి ఫోన్‌చేసి సాయంత్రంలోగా విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. రైతులు దళారులకు ధాన్యం విక్రయించి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలన్నారు. గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీచేసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యతతో కూడిన భోజనం పెడుతున్నారా? అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు.

మేనిఫెస్టో అమలు చేయాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఊట్కూరి అశోక్ గౌడ్

భువనగిరి రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ మేనిఫెస్టోలో, వరంగల్ డిక్లరేషన్ హామీలను అమలు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఊట్కూరి అశోక్ గౌడ్ అన్నారు. గురువారం భువనగిరి తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి ఆంక్షలు లేకుండా రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి, అధికారంలోకి రాగానే మాట మార్చారని ఆరోపించారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి వెంటనే కొనుగోలు చేపట్టాలన్నారు. యాసంగిలో కొన్న ధాన్యానికి వెంటనే బోనస్ చెల్లించే విధంగా కృషి చేయాలన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ కె.కల్యాణ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో భువనగిరి పట్టణ, మండల అధ్యక్షులు రత్నపురం బలరాం, చీర్క సురేశ్‌రెడ్డి, నాయకులు జైనపల్లి శ్యాంసుందర్‌రెడ్డి, పట్నం శ్రీనివాస్, పడమటి మాణిక్యంరెడ్డి, తాడూరి బాలస్వామి, పబ్బురి సురేశ్, నాగు వినోద్, మాటూరి అనిల్, పాదరాజు ఉమాశంకర్, కపిల్, వెంకటేశ్, మణికంఠ ఆంజనేయులు, ఉడుత భాస్కర్, శ్రీశైలం, రమేశ్, సంతోష్ పాల్గొన్నారు.

ఉజ్వల భవిష్యత్‌కోసం శ్రద్ధగా చదువుకోవాలి

జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి మాధవిలత



వివరాలు తెలుసుకుంటున్న మాధవిలత, భాస్కర్‌రావు

భువనగిరి టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): హాస్టళ్ల సమస్యలు పరిష్కరిస్తామని, ఉజ్వల భవిష్యత్ కోసం విద్యార్థులు శ్రద్ధతో చదువుకోవాలని జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి వి మాధవిలత, అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు అన్నారు. భువనగిరిలోని ఎస్సీ కళాశాల విద్యార్థినుల వసతి గృహాన్ని గురువారం వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్ వసతులు, నిర్వహణ తీరును పరిశీలించారు. అనంతరం విద్యార్థినులతో ముఖాముఖి మాట్లాడి ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. పేర్కొన్న సమస్యలన్నింటినీ త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. అలాగే జిల్లాలోని అన్ని హాస్టళ్లలో భోజనం, మౌలిక వసతులపై సమీక్షించి నివేదిక ఇవ్వాలని జిల్లా అధికారి సాహితిని ఆదేశించారు.

మెసెంజర్ల నియామకమెప్పుడో

మెసెంజర్లు లేక కార్యాలయాలు శుభ్రం చేసుకుంటున్న సిబ్బంది



నూతనకల్ మండలకేంద్రంలోని ఎంఆర్‌సీ భవనం

నూతనకల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రాల్లోని ఎంఆర్‌సీ భవనాలు శుభ్రం చేసే మెసెంజర్లు లేక సిబ్బందే శుభ్రం చేసుకుంటున్నారు. సూర్యాపేట జిల్లాగా ఏర్పడిన తర్వాత జిల్లాలో నూతనంగా మద్దిరాల, నాగారం, చింతలపాలెం, పాలకీడు, అనంతగిరి ఐదు మండలాలు ఏర్పడ్డాయి. ప్రతి మండలంలో ఎంఆర్‌సీలు ఏర్పాటు చేసినా పాత మండలాల ఎంఈవోలే ఇన్‌చార్జిలుగా అక్కడి నుంచే విధులు నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కొత్త మండలాలకు నూతన ఎంఈవోలను నియమించడంతో అక్కడ ఎంఆర్‌సీల నుంచే కార్యకలాపాలు సాగిస్తున్నారు. కొత్త మండలాలకు సిబ్బందిని నియమించకుండా పాత మండలంలో పనిచేస్తున్న ఎల్‌డీఏలతో ఆన్‌లైన్ పనులు చేయిస్తున్నారు. కార్యాలయాలను శుభ్రం చేసే మెసెంజర్లను నియమించక పోవడంతో సిబ్బందే శుభ్రం చేసుకుంటున్నారు. నూతనకల్, నేరేడుచర్ల, తిరుమలగిరి, చిలుకూరు మండలాల్లో కార్యాలయాలు మెసెంజర్లు లేకపోవడంతో అందులో పనిచేసే సిబ్బందే కార్యాలయాలు శుభ్రం చేస్తున్నారు. వీరంతా సమగ్ర శిక్ష అభియాన్‌లో కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్నారు. జిల్లాలో డీపీవోలు 5, డీఈవోపీలు 5, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు 8, ఐఈఆర్పీలు 15, సీఆర్పీలు 4 ఖాళీలు ఉన్నాయి.

జిల్లా అధికారులకు తెలియజేశాం

నూతనకల్‌లో నిర్వహించే మెసెంజర్ పదవి విరమణ చేసిన విషయాన్ని జిల్లా అధికారులకు తెలియజేశాం. ప్రస్తుతం భవిత కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న స్కావేంజర్ భవిత కేంద్రంతో పాటు, కార్యాలయాన్ని శుభ్రం చేస్తుంది.

● ఎంఈవో, రాములునాయక్

20 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

దేవరకొండ, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం నుంచి దేవరకొండ మీదుగా వాహనంలో తరలిస్తున్న 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. గురువారం దేవరకొండ సీఐ వెంకటరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... కల్వకుర్తి రోడ్డులో వాహనాలు తనిఖీ చేస్తుండగా చింతపల్లి మండలం నసర్లపల్లి నుంచి 20క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి కల్వకుర్తికి తరలిస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు దేవరకొండ శివారులో పోలీసులు పట్టుకున్నారు. బొలేరో వాహనంతోపాటు బియ్యాన్ని స్వాధీనం చేసుకొని నిందితులు మరియాబి, సంపతయ్య, శివలపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తే కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

పిచ్చికుక్కల దాడిలో యువకుడికి గాయాలు

నార్కట్‌పల్లి, అక్టోబరు 23, (ఆంధ్రజ్యోతి): పిచ్చి కుక్కల దాడిలో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని అమ్మనబోలులో గురువారం జరిగింది. గ్రామానికి చెందిన రావుల నవీన్ అనే యువకుడు తన ఇంటి వద్ద కూర్చుని ఉండగా అక్కడకు వచ్చిన రెండు పిచ్చికుక్కలు అకస్మాత్తుగా నవీన్‌పై దాడిచేసి నోటి వద్ద తీవ్రంగా గాయపరిచాయి. దీంతో నవీన్‌ను నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు.

వలిగొండ: యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని గొల్నేపల్లి గ్రామానికి చెందిన అవిశెట్టి శ్రీశైలం ద్విచక్రవాహనంపై సంగెం గ్రామానికి వెళుతుండగా గ్రామ మధ్యలో కుక్కలు అడ్డురావడం వల్ల కింద పడి తీవ్రంగా గాయపడ్డారు. చికిత్సనిమిత్తం 108లో భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

సూర్యాపేటరూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): వ్యభిచార గృహంపై పోలీసులు దాడులు చేశారు. మహిళ, విటుడిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం సూర్యాపేట జిల్లాకేంద్రంలోని జనగాం క్రాస్ రోడ్డులో గల ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు సమాచారం మేరకు రూరల్ పోలీసులు బుధవారం ఇంటిపై దాడులు నిర్వహించారు. మహిళ, విటుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు రూరల్ ఎస్‌ఐ బాలునాయక్ తెలిపారు.

జూదరుల అరెస్టు

మునగాల, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా మునగాల మండలంలోని నరసింహులగూడెం గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... నడిగూడెం మండలం బృందావనపురానికి చెందిన కొందరు పేకాడుతున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు పేకాట స్థావరంపై దాడి చేశారు. ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. మరో ఆరుగురు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. పట్టుబడిన వారి నుంచి రూ.13500 నగదు, ఆరు బైక్‌లు, ఆరు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

మండలి చైర్మన్ గుత్తాకు స్వాగతం

చిట్యాలరూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): విదేశీ పర్యటన ముగించుకుని స్వదేశానికి వచ్చిన శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి దంపతులకు నల్లగొండ చిట్యాల మండలానికి చెందిన నాయకులు శంషాబాద్ విమానాశ్రయంలో గురువారం స్వాగతం పలికారు. స్వాగతం పలికిన వారిలో మార్కెట్ డైరెక్టర్ కోనేటి యాదగిరి, వనమా వెంకటేశ్వర్లు, తేరటుపల్లి హనుమంతు, పాటి మాధవరెడ్డి, చెరుకు సైదులు, లింగయ్య ఉన్నారు.

వినూత్నంగా ఎమ్మెల్యే వివాహ వార్షికోత్సవం

అరకులో ఆదివాసీ సంప్రదాయ రీతిలో ఎమ్మెల్యే బీఎల్ఆర్ దంపతులు



అరకులో ఆదివాసీ సంప్రదాయంలో వివాహ తంతు జరుపుకుంటున్న మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, మాధవి దంపతులు

మిర్యాలగూడ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి(బీఎల్ఆర్) దంపతులు తమ వివాహ వార్షికోత్సవాన్ని వినూత్నంగా నిర్వహించుకున్నారు. తమ 32వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 22వ తేదీన కుటుంబ సభ్యు లతో కలిసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అరకు లోయకు వెళ్లిన ఎమ్మెల్యే దంప తులు ఏజెన్సీ ప్రాంతంలోని ఆదివాసీ గూడెంలో గిరిజన సంప్రదాయ రీతిలో తమ పెళ్లిరోజు వేడుకను నిర్వహించుకున్నారు. అనుకోని అతిథిలుగా తమ గూడెనికి వచ్చిన ఎమ్మెల్యే దంపతులను గిరిజనులు తమ సంప్రదాయ బూరలు ఊది, భేరీలు మోగించి నృత్యాలు చేస్తూ సాదరంగా ఆహ్వానించారు. అనంతరం తమ ఆచారం, సంప్రదాయం ప్రకారం ఎమ్మెల్యే బీఎల్ఆర్, ఆయన సతీమణి మాధవిని వరుడు, వధువుగా, ముస్తాబు చేసి పెళ్లితంతు నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి హాజరైన కొందరు సంబంధిత వీడియోను గురువారం మిర్యాలగూడ వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు చేయడంతో వైరల్ అయింది. ఎమ్మెల్యే దంపతుల వెంట పెద్ద కుమారుడు సాయిప్రసన్న, కోడలు వెన్నెల ఉన్నారు. ఇటీవల తన కుమారుడి వివాహం అనంతరం రిసెప్షన్‌ను రద్దు చేసి సీఎం సహాయ నిధికి రూ.2కోట్లు విరాళం ఇచ్చి, రాష్ట్ర ప్రజల దృష్టిని ఆకర్షించిన ఎమ్మెల్యే బీఎల్ఆర్ తన వివాహ వార్షికోత్సవాన్ని ఆదివాసీలతో కలిసి నిర్వహిం చుకుని మరోసారి వార్తల్లోకి ఎక్కారు.

వ్యాధులు.. క్యూ కడుతున్న రోగులు

● వాతావరణంలో మార్పుతో సీజనల్ వ్యాధులు ● దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి పెరుగుతున్న రోగులు ● సరిపడా బెడ్లులేక ఇబ్బందులు

వాతావరణంలో మార్పులతో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. వ్యాధుల బారిన పడకుండా అప్రమత్తత అవసరం. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు ప్రబలే అవకాశముంది. పరిసరాల పరిశుభ్రత పాటించి వ్యాధులు దరి చేరకుండా జాగ్రతలు తీసుకోవాలని డాక్టర్లు సూచిస్తున్నారు. నల్లగొండ జిల్లా దేవరకొండ డివిజన్‌లో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. వరుసగా వర్షాలు కురుస్తుండడం, వాతావరణంలో మార్పు రావడమే కారణమని వైద్యులు చెబుతున్నారు.

● ఆంధ్రజ్యోతి, దేవరకొండ



దేవరకొండ ప్రాంతీయ ఆసుపత్రిలో ఓపీ కోసం బారులు తీరిన రోగులు

వ్యాధులు ప్రబలుతుండడంతో దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి రోగుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ప్రతి రోజూ 700 నుంచి 800 వరకు ఓపీ పేషంట్లు వస్తున్నారు. జ్వరం, జలుబు, కీళ్ల నొప్పులతో అవస్థ పడుతున్నారు. దేవరకొండ ప్రాంతీయ ఆసుపత్రికి సాధారణ రోజుల్లో 500 నుంచి 650 వరకు రోగులు వచ్చేవారు. దేవరకొండ డివిజన్‌తోపాటు మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, మర్రిగూడ, నాంపల్లి, ఇతర ప్రాంతాల నుంచి కూడా రోగులు వస్తుండడంతో వంద పడకల ఆసుపత్రి కిక్కిరిస్తోంది. రోగుల సంఖ్య పెరుగుతుండడం, బెడ్లు సరిపడక పోవడంతో ఇబ్బందులుపడే పరిస్థితి ఉందని డాక్టర్లు పేర్కొంటున్నారు.

బెడ్ల సంఖ్య పెరిగితే..

ఆసుపత్రిలో రోగులకు సరిపడ మందులు, ఇంజక్షన్‌లు అన్ని సౌకర్యాలు ఉన్నాయి. సరిపోను బెడ్లు లేవు. దీంతో రోగులు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించే పరిస్థితి నెలకొంది. 200 పడకల ఆసుపత్రిగా ఏర్పాటు చేసి బెడ్లసంఖ్య పెంచాలని స్థానికులు కోరుతున్నారు. 200 పడకల ఆసుపత్రి మంజూరైనప్పటికీ స్థల పరిశీలనలో ఉంది. 200 పడకల ఆసుపత్రి ఏర్పాటైతే అన్ని సౌకర్యాలు ఉంటాయని డాక్టర్లు చెబుతున్నారు.

అందుబాటులో ఆక్సిజన్ ప్లాంట్

ప్రస్తుతం ఆసుపత్రిలో ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌తో పాటు 30 మంది డాక్టర్లు విధులు నిర్వహిస్తున్నారు. ఐసీయూ గదులను సైతం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆసుపత్రిలో ఐదు డయాలసిస్ బెడ్లు ఉన్నాయి. మరో ఐదు డయాలసిస్ బెడ్లు కూడా మంజూరయ్యాయి. వీటిని ఎమ్మెల్యే బాలునాయక్ త్వరలో ప్రారంభించనున్నారు. ఆసుపత్రిలో ఆక్సిజన్ ప్లాంట్ అందుబాటులో ఉంది. రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని జిల్లా అధికారుల ఆదేశాల మేరకు డాక్టర్‌లు, సిబ్బంది అందుబాటులో ఉండి వైద్య సేవలు అందిస్తున్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి, దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి, డీసీహెచ్ డాక్టర్ మాతృనాయక్ తనిఖీలు నిర్వహిస్తున్నారు.

సరిపడా బెడ్లు ఏర్పాటు చేయాలి



దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో సరిపడా బెడ్లు లేకపోవడంలో ఇబ్బందులు పడుతున్నాం. ఆసుపత్రికి వెళితే బెడ్లులేకపోవడంతో వైద్య పరీక్షలు చేయించుకొని విధిలేని పరిస్థితిలో ఇంటికి చేరుకునే పరిస్థితి. కొంతమంది బెడ్లు లేకపోవడంతో ప్రైవేట్ ఆసుపత్రులకు వెళుతున్నారు. 200 పడకల ఆసుపత్రిగా ఏర్పాటు చేయాలి.

వస్కుల సుధాకర్, దేవరకొండ

రోగులకు మెరుగైన సేవలు అందిస్తున్నాం



వాతావరణంలో మార్పులు, వరుసగా వర్షాలు కురుస్తుండడంతో ఆసుపత్రికి రోగుల సంఖ్య పెరిగింది. రోజుకు 800కుపైగా ఓపీ పేషంట్‌లు జ్వరం, దగ్గు, జలుబు సమస్యలతో వస్తున్నారు. రోగులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నాం. 200 పడకలుగా ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని ఉన్నత అధికారులకు చెప్పాం.

● డాక్టర్ రవిప్రకాష్, ఇన్‌చార్జి సూపరింటెండెంట్.

పరువుపోతుందని హత్య చేశారు

● వీడిన మహిళ హత్య కేసు మిస్టరీ ● వివాహేతర సంబంధం నెరుపుతుందనే హత్య ● ఐదుగురి అరెస్ట్, పరారీలో మరొకరు



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ప్రసన్నకుమార్

సూర్యాపేటక్రైం, అక్టోబరు 23,(ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధం కొనసాగిస్తుండడంతో తమ పరువు పోతుందని భావించి మహిళను హత్య చేసిన నిందితులను సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) పోలీసులు అరెస్ట్ చేశారు. ఐదుగురిని అరెస్టు చేయగా, మరో నిందితుడు పరారీలో ఉన్నాడు. సూర్యాపేట డీఎస్పీ వి. ప్రసన్న కుమార్ గురువారం రాత్రి సూర్యాపేటలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఆత్మకూర్(ఎస్) మండలం ఏపూరు గ్రామానికి చెందిన కొరివి మల్లయ్య-భిక్షవమ్మ దంపతులు గ్రామంలో నివసిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. మల్లయ్య లారీ డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మల్లయ్య పెద్ద కుమారుడు భరత్‌కు వివాహమైంది. చిన్న కుమారుడు ప్రవీణ్‌కు వివాహం కాలేదు. భిక్షవమ్మ మరో వ్యక్తితో వివాహేతర సంబంధం కొనసాగిస్తుంది. ఈ విషయమై పలుమార్లు కుటుంబ సభ్యులు భిక్షవమ్మను హెచ్చరించారు. గ్రామంలో, కుటుంబంలో పరువు పోతుందని, చిన్న కుమారుడు ప్రవీణ్‌కు వివాహం కావడం లేదని పలుమార్లు చెప్పారు. అయినా ఆమె ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో ఎలాగైనా ఆమెను చంపాలని భర్త మల్లయ్య, హైదరాబాద్‌లో ఏసీ మెకానిక్‌గా పనిచేసే మల్లయ్య పెద్ద కుమారుడు కొరివి భరత్, హైదరాబాద్‌లో చికెన్ సెంటర్‌లో పనిచేసే చిన్న కుమారుడు ప్రవీణ్, మల్లయ్య సమీప బంధువు హైదరాబాద్‌లో ఉంటూ చికెన్ సెంటర్ నడుపుతున్న కొరివి మహేష్, మల్లయ్య చిన్న కుమారుడు ప్రవీణ్ మిత్రులైన ఏపూరు గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్లుగా పనిచేసే పూసపల్లి జనార్దన్, పోకబత్తిని వంశీ కలిసి పథకం పన్నారు. ఈ నెల 21 గ్రామంలో పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ ఉండడంతో భిక్షవమ్మ ఏపూరు గ్రామానికి వచ్చింది. పంచాయితీ అనంతరం తర్వాత తిరిగి వెళ్తుండగా ముందుగా అనుకున్న పథకం ప్రకారం గ్రామంలోనే జనార్దన్ బైక్‌పై వెళ్లి భిక్షవమ్మను అడ్డుకుని, మహేష్, వంశీలకు ఫోన్ చేశాడు. దీంతో వెంటనే వారు కారులో సంఘటనా స్థలం వద్దకు వచ్చి కారులో నుంచి దిగి వెంట తెచ్చుకున్న కత్తులతో భిక్షవమ్మను గొంతుకోసి, ఛాతిలో పొడిచి హత్య చేసి పరారయ్యారు. ఈ విషయమై ఆత్మకూర్(ఎస్) పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. హత్యలో పాల్గొన్న వారిని సాంకేతిక ఆధారాలతో గుర్తించారు. హత్యలో పాల్గొన్న మల్లయ్య, భరత్, ప్రవీణ్, జనార్దన్, వంశీ ఈ నెల 23న సూర్యాపేట పట్టణంలోని హైటెక్ బస్టాండ్ ప్రాంతంలో ఉన్నట్లు విశ్వసనీయ సమాచారంతో పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని అరెస్ట్ చేశారు. వారి నుంచి కారు, ఆటో, రెండు బైక్‌లు, హత్యకు ఉపయోగించిన కత్తులు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కోర్టుకు రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. మరో నిందితుడు కొరివి మహేష్ ప్రస్తుతం పరారీలో ఉన్నాడని, అతనిని కూడా త్వరలో పట్టుకుంటామని డీఎస్పీ తెలిపారు. సమావేశంలో సూర్యాపేట రూరల్ సీఐ గురుకుల రాజశేఖర్, ఆత్మకూర్(ఎస్), చివ్వెంల ఎస్‌ఐలు శ్రీకాంత్, మహేశ్వర్, సిబ్బంది హమీద్, వెంకటేష్, విజయ్, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

కారులో వచ్చి.. రైలుకు ఎదురు వెళ్లి



అభిలాష్(ఫైల్)

బీబీనగర్, భూదాన్‌పోచంపల్లి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): వేర్వేరు కారణాలతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు. యాదాద్రిభువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలంలోని అంతమ్మగూడెం గ్రామానికి చెందిన వస్పరి వెంకటేశ్‌కు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు అభిలాష్(19) ఉన్నారు. అభిలాష్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్కేసర్ మండలం ఔషాపూర్ శివారులోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. బుధవారం కళాశాలకు వెళ్లి సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చిన అభిలాష్ రాత్రి 10గంటల సమయంలో కుటుంబ సభ్యులతో కలిసి నిద్రించాడు. అందరూ పడుకున్న తర్వాత కారులో ఇంటి నుంచి బయలు దేరి బీబీనగర్‌లోని ఎయిమ్స్ ఎదురుగా ఉన్న రైల్వే ట్రాక్ పక్కన సర్వీస్ రోడ్డుపై కారును పార్కు చేసి బీబీనగర్ - ఘట్కేసర్ రైల్వే స్టేషన్ల మార్గమధ్యలో మనుగూరు ఎక్స్‌ప్రెస్ రైలుకు ఎదురుగా వెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ దృశ్యాన్ని నేరుగా చూసిన రైలు లోకోపైలెట్ బీబీనగర్ స్టేషన్ మాస్టర్‌కు సమాచారం ఇచ్చాడు. ఆయన వెంటనే రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. జీఆర్‌పీ ఇన్‌చార్జి కృష్ణారావు సంఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. అభిలాష్ మృతితో స్వగ్రామం భూదాన్‌పోచంపల్లి మండలంలోని అంతమ్మగూడెంలో విషాదఛాయలు అలుముకున్నాయి. తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు.

ఆర్థిక ఇబ్బందులు తాళలేక..



నంద్యాల నర్సిరెడ్డి (ఫైల్)

చండూరు రూరల్: ఆర్థిక ఇబ్బందులు తాళలేక క్రిమిసంహారక తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నల్లగొండ జిల్లా, చండూరు మండలం, కస్తాల గ్రామ ఆవాసం మెండువారిగూడెం గ్రామంలో జరిగింది. ఎస్‌ఐ వెంకన్న, కుటుంబసభ్యులు తెలిపిన వివారల ప్రకారం... గ్రామానికి చెందిన నంద్యాల నర్సిరెడ్డి(48) గ్రామంలో తనకున్న నాలుగు ఎకరాల భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా కుటుంబంలో ఆర్థిక ఇబ్బందులు తాళలేక బుధవారం రాత్రి ఊరికి దూరంగా బహిరంగ ప్రదేశంలో ఎవరూలేని సమయంలో క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. రాత్రి 10గంటలు దాటినా నర్సిరెడ్డి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఫోన్ చేశారు. ఎంతకూ ఎత్తకపోవడంతో ఆందోళనకు గురైన స్థానికులతో కలిసి అర్ధరాత్రి వరకు వెతికారు. నర్సిరెడ్డి ఊరికి దూరంగా నిర్మానుష ప్రదేశంలో విగత జీవిగా పడి ఉన్నాడు. దీంతో పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నర్సిరెడ్డి కుమారుడు కిరణ్‌కుమార్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్న ఎస్‌ఐ తెలిపారు.

ముకుందాపురంలో విద్యుదాఘాతంతో తాపీమేస్త్రి మృతి

మునగాల, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో తాపీ మేస్త్రి మృతిచెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా మునగాల మండలంలోని ముకుందాపురం గ్రామంలో గురువారం జరిగింది. ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన షేక్ చిన్న సైదులు(50), అదే గ్రామంలో జట్టి శ్రీరాములు ఇంటి ప్రహరీ నిర్మించేందుకు కొందరు కూలీలతో కలిసి తాపీ పనులు చేస్తున్నాడు. ఈ క్రమంలో సైదులు పిల్లరు గుంతలో ఐరన్ పెట్టే క్రమంలో 11కేవీ విద్యుత్ లైన్ తీగలు ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై కిందపడిపోయాడు. వెంటనే 108 వాహనంలో కోదాడ ప్రభుత్వ ఆస్పత్రి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. సైదులుకు ముగ్గురు కూతుర్లు, భార్య ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు పోలీసులు తెలిపారు.

అండర్‌పాస్.. అయ్యేదెన్నడో

● కొనసాగుతున్న అండర్‌పాస్ బ్రిడ్జి పనులు

● పనుల్లో తీవ్ర జాప్యం ● ఇబ్బంది పడుతున్న వాహనదారులు



కొమరబండ వద్ద నిర్మిస్తున్న అండర్‌పాస్ బ్రిడ్జి

కోదాడ రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కోదాడలోని హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిపై కొమరబండ వై-జంక్షన్ వద్ద అండర్‌పాస్ బ్రిడ్జి పనులు కొనసాగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం రూ.36 కోట్ల మంజూరు చేసి ఆరు నెలల క్రితం పనులు ప్రారంభించారు. పనులు దక్కించుకున్న గుజరాత్ రాష్ట్రానికి చెందిన ఓ నిర్మాణ సంస్థ పనుల్లో జాప్యం చేస్తుండడంతో వాహనదారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. హైద్రాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై కోదాడ మండలంలోని నల్లబండగూడెం గ్రామం రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద రూ.40 కోట్లతో ఫ్లైఓవర్ పనులు జరుగుతున్నాయి. కొమరబండ వై-జంక్షన్ వద్ద అండర్‌పాస్ బ్రిడ్జికి కూడా ప్రభుత్వం రూ. 36కోట్లు మంజూరు చేసింది. ఈ రెండు ప్రాంతాలను జాతీయ రహదారి సంస్థ అధికారులు బ్లాక్ స్పాట్లుగా గుర్తించారు. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిని నాలుగు లేన్ల రహదారిగా నిర్మిస్తున్న సమయంలోనే అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మాణం చేయాల్సి ఉంది. కానీ అధికారులు దానిని పట్టించుకోలేదు. దీంతో కోదాడ నుంచి హైదరాబాద్‌కు వెళ్లడానికి వాహనదారులు జాతీయ రహదారి దాటాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ సమయంలో హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న వాహనాలు రోడ్డు దాటుతున్న వాహనాలు, ద్విచక్ర వాహనాలను ఢీకొన్న సంఘటనలు ఉన్నాయి. ఈ ప్రమాదాల్లో అనేక మంది మృత్యువాతపడ్డారు. మరికొంతమంది క్షతగాత్రులుగా మారారు. దీంతో ఈ ప్రాంతాన్ని బ్లాక్‌స్పాట్‌గా గుర్తించి నిధులు మంజూరు చేయడంతో పనులు ప్రారంభించిన సంస్థ పనులు వేగవంతం చేయకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మాణం కోసం రోడ్డుకు ఇరువైపులా సర్వీస్‌రోడ్లను ఏర్పాటు చేశారు. ఈ రోడ్లు కూడా అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తికాకుండానే వర్షాలకు కొట్టుకుపోయాయి. రోడ్లు మళ్లీ నిర్మించినా బ్రిడ్జి నిర్మాణ పనులు ఇంకా ప్రారంభించలేదు. బ్రిడ్జి నిర్మాణ పనులను సంవత్సరంలో పూర్తిచేయాల్సి ఉండగా, ఇప్పటికే ఆరునెలలు దాటిపోయిందని వాహనదారులు, ప్రజలు పేర్కొంటున్నారు.

వాహనాల దారి మళ్లింపు

అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మాణం వల్ల కోదాడ పట్టణానికి వచ్చే వాహనాలకు కొమరబండ వై-జంక్షన్ వద్ద పనులు జరుగుతున్నందున హుజూర్‌నగర్ రోడ్డు మీదుగా ట్రాఫిక్‌ను దారి మళ్లించారు. కోదాడ బస్టాండ్‌కు నిత్యం హైదరాబాద్, విజయవాడ వెళ్లేందుకు 500 బస్సులకు పైగా వచ్చి వెళ్తుంటాయి. ఈ బస్సులు కూడా అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మాణం వల్ల హుజూర్‌నగర్ రోడ్డు మీదుగా అయ్యప్పస్వామి గుడి పక్కన ఉన్న ఫ్లైఓవర్ కు వైపు దారి మళ్లించారు. దీంతో హుజూర్‌నగర్ రోడ్డుకు వాహనాల రద్దీ పెరిగిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పల్లె వెలుగు బస్సులు, గ్రామీణ ప్రాంతాలకు వెళ్ళే బస్సులను సైతం హుజూర్ నగర్ రోడ్డు మీదుగా దారి మళ్లించడంతో ఇబ్బందులు పడుతున్నట్లు ప్రయాణికులు తెలిపారు.

పనులు త్వరగా పూర్తిచేయాలి



కొమరబండ వై-జంక్షన్ వద్ద అండర్‌పాస్ బ్రిడ్జి పనులు పూర్తిచేసి వాహనదారుల ఇబ్బందులు తొలగించాలి. నడిగూడెం, మునగాల మండలాల్లోని గ్రామీణ ప్రాంతాల ప్రజలు కోదాడ పట్టణానికి రావాలంటే అండర్‌పాస్ బ్రిడ్జి నుంచి రావాల్సి ఉంది. పనులు నత్తనడకన సాగడం వల్ల వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వేసిన రోడ్డే వేస్తున్నారు తప్ప బ్రిడ్జి పనులు ముందుకు సాగడం లేదు. వెంటనే అండర్‌బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తిచేసి వాహనదారులు, గ్రామీణ ప్రాంత ప్రజల ఇబ్బందులు తొలగించాలి.

● ఎం. ముత్యాలు, కోదాడ

రాష్ట్ర ప్రజలకు మేలు జరగాలి

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



పూజల్లో పాల్గొన్న కల్వకుంట్ల కవిత

యాదగిరిగుట్ట, భువనగిరి టౌన్ అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రజలకు మేలు జరగాలనేది తన ఆకాంక్ష అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని గురువారం సందర్శించారు. భువనగిరి, యాదగిరిగుట్టలో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 25 నుంచి తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో చేపట్టబోయే జనం బాట కార్యక్రమం ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ చేస్తామన్నారు. సుమారు నాలుగు నెలలపాటు నిర్వహించే కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలను కలిసి వారి సమస్యలు తెలుసుకుంటామన్నారు. తిరుపతి తర్వాత యాదగిరిగుట్ట దేవాలయాలను దర్శించుకున్నామన్నారు. నిజామాబాద్ నుంచి చేపట్టబోయే జనం బాట కార్యక్రమం విజయవంతానికి ఎలాంటి అవాంతరాలు ఎదురుకాకుండా స్వామిని వేడుకున్నామన్నారు. ప్రతీ జిల్లాలో రెండు రోజులపాటు పర్యటించే విధంగా ప్రణాళికలు రూపొందించామన్నారు. భవిష్యత్తులో తాము అనుసరించే వైఖరిని ప్రజాబాటలో వెల్లడిస్తామన్నారు.

ఆలయ ప్రాశస్త్యాన్ని కాపాడాలి

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత కేసీఆర్ నేతృత్వంలో యాదగిరిగుట్ట ఆలయం అద్భుతంగా నిర్మితమైందని కవిత తెలిపారు. ఆలయ ప్రాశస్త్యాన్ని కాపాడేందుకు ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. తిరుపతిలో స్వామివారి హోర్డింగులు, చిత్రపటాలవలె కాకుండా విచిత్రమైన హోర్డింగులు ఇక్కడ వెలిశాయన్నారు. ఇక్కడ నెలకొన్న సమస్యలపై మళ్లీ వచ్చినప్పుడు వివరిస్తానన్నారు. కార్యక్రమంలో జాగృతి జిల్లా అధ్యక్షుడు చందుపట్ల సుజిత్‌రావు, ప్రచార కార్యదర్శి దుగుంట్ల నరేష్, కోల శ్రీనివాస్, బాలకృష్ణ, ఎత్తరి మారయ్య, రాంకోటీ ప్రజాపతి, గోపు సదానంద, యూనైటెడ్ పూలె ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ బొల్ల శివశంకర్ పాల్గొన్నారు.

స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్సీ కవిత

స్వామిని ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి సంస్థ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత దర్శించుకోగా గర్భాలయంలోని స్వయంభువులకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ సంప్రదాయ మేరకు ఎమ్మెల్సీకి పూజారులు స్వాగతం పలికారు. వేద మండపంలో పండితులు వేద ఆశీర్వచనంచేసి లడ్డూ ప్రసాదాలు అందజేశారు. అంతకుముందు స్వామివారికి పట్టువస్త్రాలు, పూలు, పండ్లు సమర్పించారు.

ధ్వంసమైన ఎయిర్ వాల్వ్‌కు మరమ్మతు



జాతీయ రహదారిపై ప్రవహిస్తున్న నీరు

ధ్వంసమైన ఎయిర్‌వాల్వ్

నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలం చిన్నఅడిశర్లపల్లి గ్రామ సమీపంలోని కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యానవన కేంద్రం వద్ద గేల్‌వాల్వ్ ధ్వంసమైంది. దీంతో పైప్‌లైన్ లీకై నీరు మొత్తం జాతీయ రహదారిపై ప్రవ హించడంతోవాహనదారులు ఇబ్బంది పడ్డారు. ఓ ప్రయాణికుడు వందకు డయల్ చేయడంతో సమాచారం తెలుసుకున్న హైదరాబాద్ మెట్రో బోర్డు అధికారులు వెంటనే నీటి సరఫరాను నిలిపివేసి మరమ్మతులు చేపట్టి నూతన ఎయిర్‌వాల్వ్ బిగించారు. నాగార్జునసాగర్ నుంచి అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు నీటిని తరలించి కోదండాపురం ప్లాంట్ ద్వారా హైదరాబాద్‌కు పెద్ద మొత్తంలో పైప్‌లైన్ ద్వారా నీటిని సరఫరా చేశారు.

(ఆంధ్రజ్యోతి -కొండమల్లేపల్లి)

రైతులకు వాయుగండం

- వర్షాలతో అన్నదాత ఆగమాగం
- సాగర్ ఆయకట్టులో నేలవాలుతున్న పొలాలు
- గింజ దశలోనే పడి పోతున్న పంట

మిర్యాలగూడ, వ్యవసాయం, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వైపరీత్యాలు అన్నదాత కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. వరి గింజ పాలుపోసుకుని చేతికొచ్చే దశలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో వరి పంటకు నష్టం వాటిల్లుతోంది. గాలి వానకు పంట నేల వాలి పోతుండడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. సాగర్ ఆయకట్టులో వరి చివరి దశలో ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు 50 శాతంపైనే వరి నేలపై పడి పోయింది. దీంతో గింజ నాని పోయి మొలకలు వస్తున్నాయని రైతులు ఆందోళన చెందుతు న్నారు. కింద పడి పోయిన పొలాలను పైకి లేపి కట్టలు కట్టిస్తున్నారు. ఒక ఎకరానికి సుమారు 15మంది కూలీలు అవసరమవు తుంది. ఒక్కొక్కరికి రూ.4 వందల చొప్పున రూ.6వేల వరకు ఖర్చవుతుండడంతో రైతులకు భారంగా మారింది. మళ్లీ గాలితో కూ డిన వర్షం పడితే నిలబెట్టిన కర్రలు కింద పడిపోయి పూర్తిస్థాయిలో చేతికి రాకుండా పోతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరిసాగు చేసిన రైతులు కూలీల ఖర్చు భరించలేక పంటలను వదిలేసే పరిస్థితి నెలకొంది. వాయుగుండంతో వరుసగా వర్షాలు కురుస్తాయనే వాతావరణ శాఖ ప్రకటనతో పంట చేతికొచ్చేది కష్టమే అనే ఆందోళన అన్నదాతల్లో మొదలైంది.





సాగర్ ఆయకట్టు ప్రాంతంలో గాలి వర్షానికి ఒరిగిన వరి పొలం



కింద పడిన వరిని కట్టలు కడుతున్న కూలీలు

వర్షాలకు నేలకొరిగిన పంటలు

చింతలపాలెం : సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలంలో తుపాను ప్రభావంతో రెండు రోజుల నుంచి కురిసిన వర్షం కారణంగా పత్తి, మిర్చి, వరి పంటలు నేలకొరిగాయి. బలమైన గాలులతో కూడిన వర్షం వల్ల చేతికొచ్చిన పంట నేలమట్టమై పంటలు దెబ్బతిన్నాయి. ప్రధానంగా పత్తి పంట రంగు మారింది. అంతేకాక మొక్కలపై పగిలిన పత్తి తడవడంతో పత్తిలో ఉన్న గింజలు నాని మొలకలు రావడంతో రైతులను తీవ్రంగా నష్టపరిచింది. ఈ ఏడాది సకాలంలో వర్షాలు పడటంతో వరి పంట ఏపుగా పెరిగింది. ఈ అకాల వర్షాల వల్ల వరి కూడా నేలకు వాలటంతో రైతులకు అపార నష్టం వాటిల్లిందని మండలంలోని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పత్తి గింజలు మొలకలు వచ్చాయి



ఈ ఏడాది మూడు ఎకరాల పత్తి సాగు చేస్తున్నా. ఈ అకాల వర్షంతో పత్తి పూర్తిగా తడవడంతో పచ్చి రంగు మారింది. పత్తి గింజలు నాని మొలకలు ఎతా యి. దీంతో మార్కెట్ ధరలో ధర తగ్గే అవకాశం ఉంది. పెట్టిన పెట్టుబడులు కూడా వెళ్లే అవకాశం లేదు.

-నరసింహారెడ్డి. చింతలపాలెం



వర్షాలకు సూర్యాపేట జిల్లా చింతలపాలెంలో దెబ్బతిన్న పత్తి పంట

నాణ్యమైన పత్తికి మద్దతు ధర

- రాష్ట్ర పశుసంవర్ధక, వ్యవసాయ శాఖ సంచాలకుడు గోపి
- ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పత్తి మిల్లుల తనిఖీ



సూర్యాపేట జిల్లా సూర్యాపేట మండలం బాలెంలలో మంజీత్ కాటన్ మిల్లులో పత్తిని పరిశీలిస్తున్న గోపి, కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

నార్కట్‌పల్లి, అక్టోబరు 23,(ఆంధ్రజ్యోతి): సీసీఐ నిబంధనల మేరకు నాణ్యమైన పత్తిని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి రైతులు మద్దతు ధర పొందాలని పత్తి కొనుగోలు జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర పశుసంవర్ధక, వ్యవసాయ శాఖ సంచాలకుడు బీ. గోపి సూచించారు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం చౌడంపల్లి వరలక్ష్మి కాటన్ మిల్‌ను కలెక్టర్ ఇలా త్రిపాఠి, జిల్లా ఉన్నతాధికారులతో కలిసి గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో ముఖాముఖి మాట్లాడారు. ఏనుగులదొరి గ్రామానికి చెందిన పన్నాల యాదగిరి రెడ్డి అనే రైతు గోపితో మాట్లాడుతూ రెండు నెలలుగా కురుస్తున్న వర్షాలతో పత్తిలో తేమశాతం బాగా ఉందని, రోజుల తరబడి ఆరబెట్టినా వాతావరణం దృష్ట్యా 12 శాతం తేమ వచ్చేలా లేదన్నారు. తేమ శాతాన్ని 15కు పెంచాలని కోరారు. దీంతో ఆయన స్పందించి తేమ శాతం పెంచడమనేది కేంద్రం ప్రభుత్వ పరిధిలోని సీసీఐ అంశమని చెప్పారు. అంతకు ముందు కాటన్ మిల్ కార్యాలయంలో జిల్లా ఉన్నతాధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. జిల్లా వ్యవసాయ శాఖ తరఫున ఓ అధికారిని జిన్నింగ్ మిల్లుల వద్ద పర్యవేక్షణ కోసం నియమించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, సబ్‌కలెక్టర్ అమిత్ నారాయణ, ఆర్డీవో యానాల అశోక్‌రెడ్డి, వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ జేడీ శ్రవణ్ కుమార్, డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డి, మార్కెటింగ్ ఏడీ ఛాయాదేవి, వరలక్ష్మీ కాటన్ మిల్ యజమాని శ్రీధర్‌రెడ్డి, తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్‌రావు, ఏవో గౌతమ్ పాల్గొన్నారు.

కపాస్ కిసాన్ యాప్‌పై అవగాహన కల్పించాలి

సూర్యాపేటరూరల్ : రైతులకు కపాస్ కిసాన్ యాప్‌పై అవగాహన కల్పించాలని రాష్ట్ర పశుసంవర్ధక, వ్యవసాయ శాఖ సంచాలకుడు బీ.గోపి అన్నారు. సూర్యాపేట మండలం బాలెంలలోని మంజిత్ పత్తి మిల్‌ను సూర్యాపేట కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాపాస్ కిసాన్ యాప్ ద్వారా రైతులు స్లాట్ బుక్ చేసుకుని పత్తిని విక్రయించుకోవాలని సూచించారు. స్లాట్ ఎలా బుక్ చేసుకోవాలో వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. రైతులు తమ ఫోన్ నంబర్లు అప్‌డేట్ చేసుకోవాలని తెలిపారు. అనంతరం బాలెంల రైతు వేదికలో వ్యవసాయ అధికారులతో యాంత్రీకరణ, ఎరువుల నిల్వలు, వ్యవసాయ శాఖ పథకాలు, రైతులకు అందించే సబ్సిడీలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. డీఏవో శ్రీధర్‌రెడ్డి, మార్కెటింగ్ అధికారి నాగేశ్వరవర్మ, ఏవో కృష్ణసందీప్ పాల్గొన్నారు.

గాలి వ్యాధి నివారణ శిబిరం ప్రారంభం

చిట్యాలరూరల్ : పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా టీకాలు వేయించాలని రాష్ట్ర పశువైద్య, పశుసంవర్ధకశాఖ సంచాలకుడు డాక్టర్ బి. గోపి అన్నారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పిట్టంపల్లిలో గురువారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాల శిబిరాన్ని ఆయన ప్రారంభించి పశువులకు టీకాలు వేశారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పశువులకు వైరల్ వ్యాధిగా గాలికుంటు వ్యాధి సోకుతుందని ఆవ్యాధికి చికిత్స కంటే టీకాతో నివారణ తోనే సులువైన మార్గమన్నారు. గ్రామాల్లో ఉచిత టీకాల కార్యక్రమాన్ని పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో వచ్చే నెల 14వ తేదీ వరకు నిర్వహించనున్నామని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తెలంగాణలో పాడి పరిశ్రమ, పశు ఉత్పత్తులకు ప్రత్యేక గుర్తింపు రావడంతో పాటు అంతర్జాతీయంగా వ్యాపారాభివృద్ధి రైతుల ఆర్థిక వ్యవస మెరుగుపడుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా పశువైద్య, పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్. జివి రమేష్, చిట్యాల మండల పశువైద్యాధికారులు డాక్రట్ వి. అభినవ్, డాక్టర్ జె. అమరేందర్ పాల్గొన్నారు.

బీబీనగర్ ఎయిమ్స్ ఈడీగా ప్రొఫెసర్ అమితఅగర్వాల్



బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రొఫెసర్ అమితఅగర్వాల్

యాదాద్రి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్ ఎయిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా(ఈడీ) ప్రొఫెసర్ అమిత అగర్వాల్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం లక్నోలోని సంజయ్‌గాంధీ పోస్ట్‌గ్రాడ్యుయేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎస్‌జీపీజీఐ) నుంచి ఆమె బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎయిమ్స్ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ప్రజలకు వైద్యం అందించడంతో పాటు వైద్య విద్యార్థులకు అనుగుణంగా సంస్థను బలోపేతం చేస్తామన్నారు. ప్రతి విభాగంలో కొనసాగుతున్న కార్యకలాపాలు, అవసరాలపై ప్రత్యక్ష అవగాహన పొందేందుకు ఎయిమ్స్‌లోని అన్ని శాఖలను సందర్శిస్తానని, అన్ని విభాగాలతో సమన్వయంతో వైద్య సేవలు మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు అందరూ కలిసి పనిచేయాలని, తద్వారా సంస్థ బలోపేతం అవుతుందన్నారు. ఎయిమ్స్ పరిధిలో జరుగుతున్న అన్ని కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని, ఇందుకోసం ప్రత్యేకంగా రోడ్ మ్యాప్‌ను రూపొందించనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా పలు శాఖల అధిపతులు, సిబ్బంది ఈడీని అభినందించారు.

తగ్గుతున్న సాగర్ నీటిమట్టం

- ఎగువనుంచి 48,778 క్యూసెక్కుల వరద
- 587.20 అడుగుల వద్ద సాగర్ నీటి మట్టం

నాగార్జునసాగర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు నీటి మట్టం రోజుకు 0.30 అడుగుల చొప్పున తగ్గుతోంది. ఈ నెల 21వ తేదీన 587.80 అడుగులు, 22వ తేదీన 587.50గా ఉన్న నీటిమట్టం గురువారం సాయంత్రానికి 587.20 అడుగులకు చేరుకుంది. సాగర్ నుంచి కుడికాల్వ ద్వారా 7,033 క్యూసెక్కులు, ఎడమకాల్వ ద్వారా 6,556 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 33,089 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800 క్యూసెక్కులు, వరదకాల్వ ద్వారా 300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 48,778 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా ఎగువనుంచి 48,778 క్యూసెక్కుల వరద సాగర్‌కు వచ్చి చేరుతోంది. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590అడుగులు (312.0450టీఎంసీలు)కాగా గురువారం సాయంత్రానికి 587.20 అడుగులు (305.6242టీఎంసీలు)గా నమోదైంది.

మూసీకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

కేతేపల్లి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మూసీ ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ప్రాజెక్టు 645 అడుగులు(4.46టీఎంసీలు) పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు ప్రస్తుత నీటిమట్టం 644.60అడుగులు(4.36టీఎంసీలు)గా ఉంది.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు



ప్రాకార మండపంలో లక్ష్మీనృసింహుడికి నిత్యకల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దివ్యక్షేత్రంలో గురువారం నిత్య కైంకర్యాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రధానాలయ నైరుతి దిశలో అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను దివ్యమనోహరంగా అలంకరించిన అర్చకులు గజవాహన సేవలో తీర్చిదిద్ది వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల నడుమ సేవోత్సవం చేపట్టారు. ఉత్సవమూర్తులను కల్యాణ మండపంలో అధిష్టింపజేసి, విశ్వక్సేనుడి తొలిపూజలతో కల్యాణతంతు కొనసాగింది. కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులకు స్వామివారి శేషవస్త్రాలు, ఆశీర్వచనం అందజేశారు. ముందుగా సుదర్శన శతక పఠనంతో హోమం నిర్వహించారు.

ప్రభాతవేళ స్వామిఅమ్మవార్లను సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చకులు నిజాభిషేకం, నిత్యార్చనలు చేపట్టారు. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సంప్రదాయ రీతిలో జరిగాయి. కొండపైన శివాలయంలో పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి నిత్య పూజలు, యాగశాలలో నిత్య రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. ఆలయ ఖజానకు వివిధ విభాగాల ద్వారా రూ. 5,34,898 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఇన్‌చార్జి ఈవో గుగులోతు రవి తెలిపారు. కాగా, కార్తీక మాసంలో కొండకింద ఆధ్యాత్మిక వాడలోని వ్రత మండపాల్లో 199 జంటలు వ్రతాలు చేశాయి. మొదటి విడత 44, రెండో విడత 64, మూడో విడత 55, నాలుగో విడత 19, ఐదో విడత 09, ఆరో విడత 08 వ్రతాలు నిర్వహించినట్లు పర్యవేక్షకుడు దొమ్మాట సురేందర్‌రెడ్డి తెలిపారు.

స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే గండ్ర

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారిని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కుటుంబ సమేతంగా గురువారం దర్శించుకున్నారు. గర్భాలయంలోని స్వయంభువులకు ప్రత్యేక పూజలు చేశారు. వేద మండపంలో పండితులు వేద ఆశీర్వచనం చేయగా లడ్డు ప్రసాదం అందజేశారు.

చేనేత కార్మికులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

- పద్మశాలి చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు అంకం పాండు

భూదాన్‌పోచంపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : చేనేత సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని పద్మశాలి చేనేత కార్మిక సంఘం భూదాన్‌పోచంపల్లి అధ్యక్షుడు అంకం పాండు తెలిపారు. యాదాద్రిభువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లిలో గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఈనెల 27వ తేదీ ఎస్ఎల్‌బీసీ (స్టేట్ లెవల్ బ్యాంకర్స్ కమిటీ) కమిటీతో రాష్ట్ర చేనేత కమిషనర్ కార్యాలయంలో భేటీ కాను న్నదని అన్నారు. కమిటీలో తీర్మాణం చేసిన తర్వాత పథకాల అమలు ప్రారంభించనున్నారని తెలిపారు. ఇప్పటికే చేనేత కేంద్రాలున్న నియోజకవర్గాలైన భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి, ఆలేరు ఎమ్మె ల్యే, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యయాదవ్, నకిరేకల్, తుంగతుర్తి, మునుగోడు ఎమ్మెల్యేలు వేముల వీరేశం, మందుల సామేల్, రాజగోపాల్‌రెడ్డిలను రాష్ట్ర చేనేత నాయకులు తడక వెంకటేష్‌తోపాటు నాయకులు తడక రమేష్, భారత లవకుమార్ కలిసి సమస్యలను విన్నవించామని తెలిపారు. ఎప్పటికప్పుడు చేనేత సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నారని అన్నారు.

31నుంచి మత్స్యగిరి లక్ష్మీనర్సింహ స్వామి బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

వలిగొండ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రి భువనగిరి వలిగొండ మండలం వెంకటాపురం గ్రామపంచాయతీ పరిధిలోని మత్స్యగిరి లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈమేరకు గురువారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. అం తకు ముందు ఆలయ అధికారులు, పాలకవర్గం ఆయనకు బ్రహ్మోత్సవ ఆహ్వాన పత్రికను అందజేశారు. అక్టోబరు 31 నుంచి నవంబరు 5వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో దేవస్థానం ఈఓ మోహన్‌బాబు, చైర్మన్ కొమ్మారెడ్డి నరేష్‌కుమార్‌రెడ్డి, ధర్మకర్తలు కరుణాకర్, వెంకటేష్, ప్రభాకర్, అంజయ్య, రవికుమార్, జగన్మోహన్‌రెడ్డి, రాములు, కేతమ్మ, వెంకటేశం, బాలేశ్వర్, శ్రీను, అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి జూడో పోటీలకు మోత్కూరు విద్యార్థుల ఎంపిక

మోత్కూరు అక్టోబరు 23: (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు పట్టణంలోని కస్తూర్బా విద్యార్థినులు రాష్ట్రస్థాయి జూడో పోటీలకు ఎంపికయ్యారు. మోత్కూరు హైస్కూల్‌లో ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి అండర్ -14, 17 ఎస్‌జీఎఫ్ పోటీల్లో ప్రతిభ కనబర్చి ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. వీరు త్వరలో హన్మకొండలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పాఠశాల ఎస్‌వో యాదమ్మ గురువారం తెలిపారు.

బీఈడీ సెమిస్టర్ పరీక్ష ఫలితాలు విడుదల

నల్లగొండ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయ పరిధిలో బీఈడీ రెండు, నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ ఫలితాలను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు సీవోఈ ఉపేందర్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.రెండో సెమిస్టర్‌లో 3,305మంది విద్యార్థులకు 2,681మంది విద్యార్థులు (81.14శాతం) ఉత్తీర్ణత సాధించారన్నారు. నాలుగో సెమిస్టర్‌లో 2,552మంది విద్యార్థులకు2,419 (94.79శాతం) మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు.

చెర్వుగట్టు ఆలయ ఈవోగా మోహన్‌బాబు

నార్కట్‌పల్లి, అక్టోబరు 23, (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానం ముఖ్య కార్య నిర్వహణాధికారి సిరికొండ నవీన్‌కుమార్‌ను ఆలయ ఈవో బాధ్యతల నుంచి తప్పించారు. ఆయన స్థానంలో యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని వేములకొండ మత్స్యగిరి లక్ష్మీనర్సింహాస్వామి దేవస్థానం ఈవోగా పనిచేస్తున్న మోహన్‌బాబును చెర్వుగట్టు దేవస్థానం ఇన్‌చార్జి ఈవోగా నియమిస్తూ దేవదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

కమనీయం.. ప్రకృతి అందం



సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండలం లోయపల్లి గుట్ట, జాజిరెడ్డిగూడెం-అర్వపల్లి గ్రామాల మధ్యలో ఉన్న గుట్టలు ఆహ్లాదకరంగా కన్పిస్తున్నాయి. ప్రకృతి అందాలుతో పచ్చని గుట్టలు కనువిందు చేస్తున్నాయి. గుట్టల చుట్టూ పెద్ద పెద్ద చెట్ల మధ్యలో వివిధ రకాల పక్షులు కిలకిల రావాలతో కనువిందు చేస్తున్నాయి. దర్గా గుట్ట ఏటవాలుగా వెయ్యి అడుగుల లోతులో ఉంటుంది. లోయపల్లి గుట్టల్లో వివిధ రకాల జంతువులు మైమరిపిస్తున్నాయి. అడవి పందులు, నెమళ్లు, నక్కలు గుట్టల్లో జీవిస్తున్నాయి.

● ఆంధ్రజ్యోతి, అర్వపల్లి

సైబర్ మోసాలపై జాగ్రత్తగా ఉండాలి

మోత్కూరు అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని మోత్కూరు సీఐ వెంకటేశ్వర్లు విద్యార్థులకు సూచించారు. రాచకొండ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు మానవ రవాణా నిరోధక విభాగం ఆధ్వర్యంలో మోత్కూరు హైస్కూల్లో విద్యార్థులకు గురువారం అవగాన కల్పించారు. కొత్త చట్టాలు, న్యాయ వ్యవస్థ గురించి వివరించారు. మహిళలకు , బాలికలకు ఎలాంటి ఆపద వచ్చినా అత్యవసర సేవలకు 112ఒక్కటే నెంబర్ కొనసాగుతుందని తెలిపారు.

రెండో రోజూ పోలీసుల తనిఖీలు

భువనగిరి టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వలస కార్మికుల నివాసాల్లో పోలీసుల తనిఖీలు రెండో రోజూ సాగాయి. పట్టణ ఇన్‌స్పెక్టర్ ఎం.రమేష్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది వలస కార్మికులు అద్దెకు ఉంటున్న నివాసాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆధార్‌కార్డు లేని కార్మికులు వెంటనే ఆధార్‌కార్డు తీసుకుని పోలీస్‌స్టేషన్‌లో అందజేయాలని ఆదేశించారు. ఇంటి యజమానులకు కౌన్సిలింగ్ చేసి వలస కార్మికులకు అద్దెకు ఇచ్చేముందు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు.

రజక కుటుంబాలకు పనులు చూపాలి



ఆర్డీవో శేఖర్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న రజకసంఘం నాయకులు

చౌటుప్పల్ టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల్లోని కార్మికుల దుస్తులతో పాటు ఇతర వస్త్రాలను శుభ్రం చేసే పనులను స్థానిక రజక కుటుంబాలకు అప్పగించాలని రజక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్‌రెడ్డికి రజక సంఘం ఆధ్వర్యంలో గురువారం వినతి పత్రం అందజేశారు. రజకులకు ఉపాధి అవకాశాలను మెరుగు పరిచేందుకు పరిశ్రమల యాజమాన్యాలు సహకరించాలని, అందుకు ప్రభుత్వమూ తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో రజక సంఘం మండల అధ్యక్షుడు బాతరాజు యాదగిరి, మండల ప్రధాన కార్యదర్శి చామకూర యాదయ్య, పట్టణ అధ్యక్షుడు బాతరాజు ధశరథ, ప్రధాన కార్యదర్శి మలిగే బాలకృష్ణ, నాయకులు కానుగు బాలరాజు, కానుగు మల్లేశం, కేతరాజు అచ్చయ్య ఉన్నారు.

కట్టమైసమ్మకు పూజలు

చౌటుప్పల్ టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): చౌటుప్పల్ మునిసిపాలిటీలోని లక్కారం చెరువు నిండి అలుగు పోస్తుండడంతో రైతులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ గురువారం కట్ట మైసమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చెరువు అలుగులో గంగమ్మ తల్లికి పసుపు, కుంకుమతో పూజలు చేశారు. కొద్ది రోజులుగా కురుస్తున్న చెరువులు, కుంటలు నిండి అలుగు పోస్తుండడంతో భూ గర్భ జలాలు గణనీయంగా పెరగనున్నాయని చౌటుప్పల్ ఏఎంసీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనా రెడ్డి అన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ కౌన్సిలర్ కొయ్యడ సైదులు, మాజీ సర్పంచ్ పాశం సంజయ్ బాబు, పాశం కృష్ణ , మహేష్, వెంకటేశం, ఐలయ్య, బిక్షం, రాజు, పూజారి రాచకొండ భాస్కరాచార్యులు పాల్గొన్నారు.

విద్యార్థినులు లీగల్‌సెల్ సర్వీస్ అథారిటీని సంప్రదించాలి

చౌటుప్పల్ టౌన్/అడ్డగూడూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు తమ సమస్యలను లీగల్ సెల్ సర్వీస్ అథారిటీకి తెలిపి పరిష్కరించుకోవాలని చౌటుప్పల్ మండల లీగల్ సెల్ సర్వీస్ అథారిటీ చైర్మన్, జూనియర్ సివిల్ కోర్టు జడ్జి మహతి వైష్ణవి అన్నారు. స్థానిక కేజీబీవీ వసతి గృహంలోని వసతులను గురువారం జడ్జి పరిశీలించారు. ఆహార పదార్థాలు, వైద్య సదుపాయాల గురించి జడ్జి విద్యార్థులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అడ్డగూడూరు మండల కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాల, మండలంలోని కంచనపల్లి కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలల వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో లీగల్ సెల్ సభ్యులు బత్తుల గణేష్, కోక సబిత, పాఠశాల సిబ్బంది తదితరుతు పాల్గొన్నారు.

నిబద్ధత కలిగిన ఉద్యోగిని సమాజం మరువదు



వెంకటేష్‌ను సన్మానిస్తున్న డాక్టర్ ర్యాకల శ్రీనివాస్, సురేష్, సంతోష

భువనగిరి రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): నిబద్ధత, క్రమశిక్షణతో విధులు నిర్వహించిన ఉద్యోగిని సమాజం మరువదని సామాజిక వేత్త డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ అన్నారు. మండలంలోని తాజ్‌పూర్ పంచాయతీ కార్యదర్శి వై.వెంకటేష్ బదిలీపై వెళుతున్న సందర్భంగా గురువారం ఘనంగా సన్మానించారు. తాజ్‌పూర్ పంచాయతీ కార్యదర్శిగా అంకితభావంతో విధులు నిర్వహించి గ్రామాభివృద్ధికి కృషి చేసినందుకు జిల్లా, మండల స్థాయి అవార్డులను సాధించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్, ఉప సర్పంచ్‌లు బొమ్మారపు సురేశ్, ర్యాకల సంతోష, గ్రామస్థులు బాలమణి, రామస్వామి, కొండల్, సందీప్, నగేశ్, సారికా, కిరణ్, శ్రీనివాస్, వి.అంజనేయులు, బి.బాలరాజు, పంచాయతీ కార్యదర్శి నరేందర్ పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

యాదగిరిగుట్ట రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రైతులు ఎంతో కష్టపడి పండించిన ధాన్యం కొనుగోలు కేంద్రానికి తరలించిన సమయంలో అకాల వర్షంతో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం బేషరతుగా కొనుగోలు చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి మాటూరి బాలరాజ్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం యాదగిరిగుట్ట మండల కమిటీ ఆధ్వర్యంలో మాసాయిపేట, సైదాపురం, మైలారిగూడెం గ్రామాల్లోని ఐకేపీ కేంద్రాలనను పరిశీలించారు. కార్యక్రమంలో నూకల భాస్కర్‌రెడ్డి, నాయకులు తాడూరి మహేష్, జట్టు భూపాల్‌రెడ్డి, అల్లం సుభద్ర, కోకల కలమ్మ, నిర్మల, మేఘమాల తదితరులు పాల్గొన్నారు.

సీసీకెమెరా 100మంది పోలీసులతో సమానం

యాదగిరిగుట్ట రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఒక్క సీసీ కెమెరా ఉంటే 100మంది పోలీసులతో సమానమని యాదగిరిగుట్ట సీఐ బొడ్డుపల్లి భాస్కర్ అన్నారు. గురువారం మండలంలోని పెద్దకందుకూర్ గ్రామంలో సీసీకెమెరాల ప్రత్యేకతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరి ఇంటి వద్ద వారు ఇంటి భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే ఎలాంటి సంఘటనలు జరిగినా వెంటనే వారిని గుర్తించడానికి ఉపయోగపడతాయని తెలిపారు. ప్రధానంగా విద్యార్థులు గంజాయ్, డ్రగ్స్ బారిన పడకుండా తల్లిదండ్రులు సైతం వారిపై ప్రత్యేక శ్రద్ధపెట్టాలన్నారు. గ్రామాల్లో అనుమానితులు తారసపడితే వెంటనే 112కు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. ఆయనతో పాటుగా ఎస్‌ఐలు యాదయ్య, సైదులు, కృష్ణస్వామి, సుధాకర్ పాల్గొన్నారు.

'కోళ్ల ఫారం ఎత్తివేయాలి'

భువనగిరి రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కోళ్ల ఫారం నుంచి దుర్వాసన రావడంతో పాటు ఈగలు వ్యాప్తి చెందుతున్నాయని దుర్గాదేవి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు బబ్బూరి శంకర్‌గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం మండలంలోని వడాయిగూడెం శివారులో గల తిరుమల హేచరీస్ ప్రైవేట్ లిమిటెడ్ కోళ్ల ఫారం ఎదుట గ్రామస్థులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్థులు బి.సాగర్‌గౌడ్, బి.పెద్దశంకర్‌గౌడ్, ఎం.శంకర్‌గౌడ్, మల్లేష్, సత్యానారాయణ, స్వామి, క్రాంతి పాల్గొన్నారు.

రెట్టించని కిక్కు

(5వ పేజీ తరువాయి): ద్వారా రూ.79.51కోట్ల ఆదాయం చేకూరింది. గడువు పొడిగింపుతో మద్యం దరఖాస్తులు 129 వరకు పెరిగాయి. దీంతో ప్రభుత్వం అదనంగా రూ.3.87ఆదాయం సమకూరింది. ప్రభుత్వం దరఖాస్తు ఫీజును ఈ సంవత్సరం రూ.3లక్షలుగా నిర్ణయించింది. వీటిని తిరిగి చెల్లించబోమని నోటిఫికేషన్‌లో పేర్కొంది. దరఖాస్తు ఫీజును రూ.2లక్షల నుంచి రూ.3లక్షలకు పెంచడంతోపాటు జిల్లాలో పలు ప్రాంతాల్లోని మద్యం దుకాణాలపై ఆసక్తి లేకపోవడంతో దరఖాస్తులు తగ్గాయి.

ఈ నెల 27న లక్కీడ్రా

ఈ నెల 27న మద్యం దుకాణాలను కేటాయించేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. దుకాణాదారుల ఎంపిక ప్రక్రియ లక్కీ డ్రా ద్వారా ఉంటుంది. ఉదయం 11గంటల నుంచి భువనగిరి మండలంలోని రాయిగిరిలోని సోమ రాధాకృష్ణ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నారు. కలెక్టర్ ఎం.హనుమంతరావు, జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారులు హాజరుకానున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

మోత్కూరు ఎక్సైజ్ సర్కిల్‌లో తగ్గిన దరఖాస్తులు

మోత్కూరు : మోత్కూరు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో ఐదు మండలాల్లోని 15 వైన్స్ దుకాణాలకు 502 దరఖాస్తులు దాఖలయ్యాయని మోత్కూరు ఎక్సైజ్ సీఐ చంద్రశేఖర్ తెలిపారు. 2021లో కన్నా 2023లో బాగా పెరిగి 2025లో బాగా తగ్గాయి. మోత్కూరు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో 15 మద్యం దుకాణాలకు 2021లో 289 దరఖాస్తులు దాఖలు కాగా 2023లో బాగా పెరిగి 651 దరఖాస్తులు దాఖలయ్యాయి. ఈ సారి (2025లో)బాగా తగ్గి 502 దరఖాస్తులు మాత్రమే దాఖలయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆదాయం పెంచుకోవడం కోసం దరఖాస్తు ఫీజును రూ.2లక్షల నుంచి రూ.3 లక్షలకు పెంచిన విషయం తెలిసిందే. ఈ నెల 18న గడువు ముగియగా దరఖాస్తులు తక్కువగా వచ్చాయని భావించిన ప్రభుత్వం గడువును 23వరకు పెంచింది. ఐదు రోజులు గడువు పెంచినా మోత్కూరు సర్కిల్‌లో పరిధిలో కేవలం 18 దరఖాస్తులు మాత్రమే అదనంగా వచ్చాయి. దరఖాస్తులు తగ్గినా, ఆదాయం పెరిగి ప్రభుత్వ లక్ష్యం నెరవేరినట్టయ్యింది. 2023లో 651 దరఖాస్తులకు రూ.2 లక్షల చొప్పున ఆనాడు ప్రభుత్వానికి రూ.13.02 కోట్ల ఆదాయం రాగా, ఈ సారి 502 దరఖాస్తులకు రూ.3 లక్షల చొప్పున రూ.15.06 కోట్లు ఆదాయం సమకూరింది. సర్కిల్ పరిధిలోని వలిగొండ మండలం అర్రూరు దుకాణానికి అత్యధికంగా 83 దరఖాస్తులు వచ్చాయి.

నత్తనడకన రోడ్డు పనులు



కంకర పోసి వదిలేసిన రాజాపేట మండలం పాముకుంట-మొల్లగూడెం రోడ్డు

రాజాపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాజాపేట మండలంలోని పాముకుంట-మొల్లగూడెం బీ టీ రోడ్డు పనులు నత్తకు నడకను నేర్పుతున్నాయి. నాటి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరై పనులు ప్రారంభించినా నేటి కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలోనూ సాగుతూనే ఉన్నాయి. కంకర పోసి మూడేళ్లు గడుస్తున్నా పనులు మాత్రం పూర్తికావడం లేదు. మండలంలోని పాముకంట నుంచి మొల్లగూడెం వరకున్న 3 కిలోమీటర్ల మట్టి రోడ్డును బిటి రోడ్డుగా మార్చేందుకు మొదటి దఫాగా రెండు కిలోమీటర్లకు గాను రూ.1.20కోట్లు సీఆర్ఆర్ నిధులు మంజూరు చేశారు. అప్పటి ఎమ్మెల్యే గొంగిడి సునితామహేందర్‌రెడ్డి 2022 జూన్30న పనులకు శంఖుస్థాపన చేశారు. పనులను ప్రారంభించి మట్టి, కంకర పోసి బీటీ వేయకుండానే మధ్యలోనే పనులను వదిలేశారు. పనులు పూర్తి కాకపోవడంతో మూడేళ్లుగా గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. కంకర తేలి ఉండటంతో వాహనాలు పాడవడంతో పాటు ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. మరో కిలోమీటరు బీటీ రోడ్డుకు రూ.1.30కోట్లు రెండో దఫా సీఆర్ఆర్ నిధులు మంజూరు చేశారు. ఇప్పటి ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య పనులను ఏడాది క్రితం ప్రారంభించారు. కాగా పనులను చేపట్టి రోడ్డు పక్కన మట్టి కుప్పలను పోసి వదిలేశారు. వర్షాలు కురిసినప్పుడు రోడ్డుపై నీరు నిల్వ ఉండటంతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రజల ఇబ్బందులను గుర్తించిన కొందరు గ్రామస్థులు మట్టిని చదును చేసి నీరు నిల్వకుండా చేశారు. అయినప్పటికీ అధ్వాన్నంగా, అసంపూర్తిగా ఉన్న రోడ్డుతో ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. అసంపూర్తిగా ఉన్న రోడ్డును పూర్తి చేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు గ్రామస్థులు పలుమార్లు మొర పెట్టుకున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు చేపట్టి పనులను పూర్తి చేయాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

ఏళ్లు గడిచినా పూర్తి చేయరా?



మండలంలోనే మారుమూల గ్రామం. అటవీ ప్రాంతానికి అనుకుని ఉంటుంది. గ్రామానికి ఉన్న మట్టి రోడ్డును బీటీ రోడ్డుగా మార్చేందుకు పనులను మూడేళ్ల క్రితం ప్రారంభించారు. కంకర, మట్టి పోసి వదిలేశారు. రోడ్డు అధ్వాన్నంగా మారింది. రాత్రిపూట ఏదైనా ఆపద వస్తే ఈ రోడ్డుగుండా వెళ్లాలంటే నరకమే. పనులను త్వరగా పూర్తి చేసి ప్రజల కష్టాలను తీర్చాలి.

-రెడ్డబోయిన రాజు, గ్రామస్థుడు, మొల్లగూడెం

పనులు త్వరగా పూర్తి చేస్తాం



పాముకుంట-మొల్లగూడెం బీటీ రోడ్డు పనులను త్వరగా పూర్తి చేస్తాం. రెండు కిలోమీటర్ల మేర రోడ్డు పనులను చేపట్టిన కంట్రాక్టర్‌కు పనులు పూర్తి చేసేందుకు నోటీసులు ఇస్తున్నాం. చర్యలు తీసుకుంటాం.

-శాడోజు శ్రీనివాస్, ఏఈ, పంచాయత్‌రాజ్, రాజాపేట

పార్సిళ్లపై పట్టింపేదీ?

(5వ పేజీ తరువాయి)

అనుగుణంగా పార్సిల్‌సర్వీస్ కేంద్రం పని చేయాల్సి ఉంటుంది. ప్రతీ పార్సిల్‌ను జాగ్రత్తగా భద్రపరచాల్సి ఉంటుంది. కానీ ఇందుకు భిన్నమైన పరిస్థితి ఇక్కడ నెలకొందని పలువురు ఆరోపిస్తున్నారు. అంతా సక్రమంగానే జరుగుతున్నదని ఆర్టీసీ అధికారులు, పార్సిల్‌సర్వీస్ ఏజెన్సీ నిర్వాహకులు పేర్కొంటున్నారు. బస్సులకు అందుబాటులో ఉంచేందుకు కొన్ని పెద్ద పార్సిళ్లను కొద్దిసేపు జాగ్రత్తల నడుమ రోడ్డు పక్కన ఉంచుతూ బస్సులలోకి చేరుస్తున్నామని అంటున్నారు. ఇప్పటివరకు వినియోగదారుల నుంచి ఫిర్యాదులు రాలేదని, నిర్వహణలో మరిన్ని జాగ్రత్తలు తీసుకుంటామని అంటున్నారు. త్వరలోనే పార్సిల్ నిర్వహణ కేంద్రాన్ని అభివృద్ధి చేస్తామని బెబుతున్నారు.

నిబంధనలు పాటించాలి

ఆలేరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆలేరు మునిసిపాలిటీ పరిధిలో హోటల్స్ నిర్వహిస్తున్న యజమానులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని మునిసిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ కోరారు. గురువారం పట్టణంలోని మాంసాహార హోటళ్లను ఆయన ఆకస్మిక తనిఖీచేశారు. నిబంధనలకు విరుద్ధంగా హోటల్స్ నిర్వహిస్తే చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు. హోటళ్లలో శుభ్రతతో పాటు నాణ్యతతో కూడిన ఆహారాన్ని అందించాలన్నారు.

కుష్ఠు నివారణపై అవగాహన పెంచుకోవాలి

బీబీనగర్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కుష్ఠు వ్యాధి నివారణపై ప్రతీ ఒక్కరు అవగాహన పెంచుకోవాలని మండల వైద్యాధికారి డాక్టర్ మౌనికారెడ్డి అన్నారు. గురువారం బీబీనగర్ మండల కేంద్రంలోని బీసీ, ఎస్సీ బాలికల పాఠశాలల్లో జిల్లా లెప్రసి లూక్లియర్స్ టీం నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. పాఠశాలల ప్రిన్సిపాల్స్ మాధవీలత, రూప పాల్గొన్నారు.

నేడు కేఎం గ్రాండ్ హోటల్ ప్రారంభం

యాదగిరిగుట్ట రూరల్, అక్టోబరు 23, (ఆంధ్రజ్యోతి): భక్తులు, పట్టణ పరిసర ప్రాంత ప్రజలకు సౌకల సౌకర్యాలతో ఏర్పాటుచేసిన కేఎం గ్రాండ్ హోటల్‌ను ఈనెల 24వ తేదీన ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ప్రారంభిస్తారని కొండపైన వెల్ఫేర్ సంఘం అధ్యక్షుడు గడ్డమీది మాధవులుగౌడ్, కేఎం గ్రాండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఆరె. వెంకటేష్‌గౌడ్ తెలిపారు. భోజన, బస సౌకర్యం కల్పిస్తూ యాత్రికులు, స్థానికులకు సేవలు అందించడమే లక్ష్యంతో ముందుకు వెళతామని చెప్పారు.

ఫీడర్‌ఛానల్ ఏర్పాటు చేయాలి

రామన్నపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమ్మాయిగూడెం గ్రామ పెద్ద చెరువుకు రామన్నపేట వెంకట్రామయ్య చిన్న చెరువుకు ధర్మారెడ్డిపల్లి కాలువ ద్వారా ఫీడర్ ఛానల్ తూములు ఏర్పాటు చేయాలని నీటి సంఘం మాజీ చైర్మన్ మన్సూర్ అలీ కోరారు. గురువారం మండల కేంద్రంలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అఖిలపక్ష, రైతు సంఘాల నాయకులు ఉన్నారు.

గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి

తుర్కపల్లి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రైతులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేయించాలని మండల పశు వైద్యాధికారి డాక్టర్ రాంచంద్రారెడ్డి కోరారు. మండలంలోని గోపాలపురం గ్రామంలో పశువైద్యశాఖ ఆధ్వర్యంలో గాలికుంటు వ్యాధి నివారణ కార్యక్రమాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు.

కుమ్మరి సంఘం అధ్యక్షుడిగా శంకరయ్య

ఆత్మకూరు(ఎం), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లెపహడ్ గ్రామంలో జరిగిన కుమ్మరి సంఘం సభ్యుల సమావేశంలో గురువారం నూతన కమిటీ ఎన్నుకున్నారు. గ్రామశాఖ అధ్యక్షుడిగా కొత్త పెల్లి శంకరయ్య, ఉపాధ్యక్షుడిగా కొత్తపల్లి పెంటయ్య, ప్రధాన కార్యదర్శిగా కొత్తపల్లి శ్రీనివాస్, కార్యదర్శిగా కొత్త పెల్లి కృష్ణమూర్తి ఎన్నికయ్యారు.

'కాంగ్రెస్‌లో ద్వితీయశ్రేణి పౌరులం'

మోత్కూరు అక్టోబరు 23: (ఆంధ్రజ్యోతి) కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జీవన్‌రెడ్డి చెప్పినట్టుగా మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీలో ఉంటూ పార్టీని బ్రతికించుకుంటున్న తాము పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికీ ద్వితీయ శ్రేణి పౌరులుగానే ఉంటున్నామని మోత్కూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వల్లభట్ల పూర్ణచందర్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం మోత్కూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. 10ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో వారి ఆగడాలను ఎదుర్కొని పార్టీని కాపాడుకుంటూ, ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకున్నామన్నారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్నాక, గతంలో పార్టీకి నష్టం కలిగించిన వారు కొత్తగా చేరి పెత్తనం చెలాయిస్తూ, తనలాంటి సీనియర్ నాయకులను, కార్యకర్తలను పక్కకు పెట్టారని ఆరోపించారు. పార్టీకి చేసిన సేవలకు గుర్తింపుగా తమకు పార్టీలో ద్వితీయ శ్రేణి స్థానం కల్పించారని, రాష్ట్రవ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉందని అన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి

రామన్నపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో కష్టపడి చదివి, ఉన్నత స్థానాలకు ఎదగాలని డివీస్ సంస్థ ప్రతినిధులు జ్యోతి వెంకటేశ్వర్లు కోరారు. రామన్నపేట మండలం వెల్లంకి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాథమిక పాఠశాలలో 330 మంది విద్యార్థులకు రూ.2లక్షలు విలువగల స్కూల్ బ్యాగ్‌లు, నోట్‌బుక్‌లను పంపిణీ చేశారు.

చేనేత పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



ఎంఎస్‌ఎంఈ పథకాలపై చేనేత కళాకారులకు అవగాహన కల్పిస్తున్న ప్రతినిధి సీత లక్ష్మణ్

భూదాన్‌పోచంపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఎంఎస్‌ఎంఈ పథకాలపై చేనేత కళాకారులు అవగాహన పెంపొందించుకోవాలని, తద్వారా ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని భూదాన్‌పోచంపల్లి హస్తకళ వీవర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ డైరెక్టర్ చిక్క కృష్ణ కోరారు. ఎంఎస్‌ఎంఈ కాంపిటీటివ్ (లీన్) స్కీం పథకంపై గురువారం భూదాన్‌పోచంపల్లిలో హస్తకళ వీవర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో సీత లక్ష్మణ్ చేనేత కళాకారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా లీన్ స్కీమ్ ఉద్దేశంతోపాటు చేనేత ఉత్పత్తులను పెంచుకోవడం, వేస్టేజీని తిరిగి ఉపయోగించడం, ఎంఎస్‌ఎంఈ పథకాలను వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పలు పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో శ్రీహస్తకళ వీవర్స్ ప్రొడ్యూస్ కంపెనీ లిమిటెడ్ డైరెక్టర్స్ చిక్క కృష్ణతోపాటు డబ్బికార్ సాయేష్‌కుమార్, సీత వెంకటేశం, గంజి బస్వలింగం, ఏలె శ్రీనివాస్, నక్క సంగీత, ఎంఎస్‌ఎంఈ జెడ్ ఫెసిలిటేటర్స్ ప్రతినిధులు ఆటిపాముల మహేందర్ పాల్గొన్నారు.

ఆరోగ్య ఉప కేంద్రం నిర్మాణ పనులు పూర్తి చేయాలి

మోత్కూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మోత్కూరు మండలం పాటిమట్ల గ్రామంలో అసంపూర్తిగా ఆగిపోయిన ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం నిర్మాణ పనులు పూర్తిచేసి, ప్రజలకు ఆరోగ్య సేవలు అందించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ డిమాండ్ చేశారు. గురువారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉపకేంద్రాన్ని పరిశీలించి మాట్లాడారు. గత ప్రభుత్వం రూ.20 లక్షల నిధులతో ఉపకేంద్రం నిర్మాణం పనులను ప్రారంభించినా కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పూర్తి చేయకుండానే వదిలేసి వెళ్లాడని అన్నారు. అసంపూర్తిగా ఉన్న ఉపకేంద్రం పనులకు అధికార పార్టీ ఎమ్మెల్యే ప్రారంభించినప్పటికీ పూర్తి కాలేదన్నారు. తక్షణమే ఉపకేంద్రం నిర్మాణం పూర్తి చేసి చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ఆరోగ్య సేవలు అందించేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ గ్రామశాఖ అధ్యక్ష, కార్యదర్శులు బండి రాజు, కురుమేటి రాజ్‌కుమార్, నరేష్, పరమేష్, దామెర స్వామి, యాదయ్య పాల్గొన్నారు.



అసంపూర్తిగా ఉన్న ఆరోగ్య ఉప కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వెంకటేష్

ప్రజాపాలనలో సొంతింటి కల సాకారం



తుర్కపల్లి: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ హనుమంతరావు, ప్రభుత్వ విప్ అయిలయ్య

తుర్కపల్లి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదోడి సొంతింటి కల నెరవేరుతోందని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. ఆయన గురువారం కలెక్టర్ హనుమంతరావు, జిల్లా, మండల స్థాయి అధికారులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి మండలంలోని వాసాలమర్రి గ్రామంలో మార్నింగ్ వాక్ నిర్వహించారు. గ్రామంలో 141ఇళ్లు మంజూరు కాగా 94 ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నాయని అధికారులు చెప్పారు. రాజకీయాలకు అతీతంగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని, ఇళ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసుకోవాలన్నారు. గ్రామం లో ఇందిరమ్మ ఇల్లు మొదటగా పూర్తి చేసుకున్న ఇంటి యాజమానికి యాట పొట్టేల్, పట్టు వస్త్రాలను అందజేస్తానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను చూసి ప్రతిపక్షాల నాయకులు ఓర్వలేక దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. అనంతరం వాసాలమర్రి పలుగుల మైసమ్మ ఆలయం వద్ద ప్రభుత్వ విప్ సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మదర్‌డెయిరీ చైర్మన్ గుడిపాటి మధుసూదన్‌రెడ్డి, తహసీల్దార్ గుగులోత్ దేశ్యానాయక్, ఎంపీడీవో లెంకల గీతారెడ్డి, ఎంపీవో వెంకటేశ్వర్లు, ట్రాన్స్‌కో ఏఈ బిక్షపతిగౌడ్, ఏపీవో నారాయణ ఉన్నారు.

దళారుల మాటలకు మోసపోవద్దు

బొమ్మలరామారం: రైతులు పండించిన ప్రతీ గింజను కొనుగోలు చేస్తామని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. మండలంలోని చీకటిమామిడి, మేడిపల్లి, ఫకీర్‌గూడెం గ్రామాలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో భువనగిరి మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ రాజేష్ పైలెట్, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఏపీవో యాదగిరి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సింగిర్తి మల్లేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ దేశెట్టి చంద్రశేఖర్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ కొండల్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు సునీత, నాయకులు రామిడి జంగారెడ్డి, లక్ష్మణ్, రాజునాయక్, లింగంతోపాటు పలువురు హాజరయ్యారు.

ప్రభుత్వ కొనుగోలుకేంద్రాల్లోనే విక్రయించాలి



మానాయికుంటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ నిరంజన్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రమించి మద్దతు ధర పొందాలని భువనగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేఖ బాబురావు కోరారు. గురువారం భూదాన్‌పోచంపల్లి మండల పరిధిలోని రామలింగంపల్లి, ఇంద్రియాల, శివారెడ్డిగూడెం, జగత్‌పల్లి, పెద్దగూడెం తదితర గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాలకు ధాన్యం తడవ కుండా రైతులు టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు లాలయ్య, అంజిరెడ్డి, రాజిరెడ్డి, దానయ్య. వెంకటేష్, జిల్లా కాంగ్రెస్ నాయకులు సామ మధుసూదన్‌రెడ్డి, మర్రి నర్సింహారెడ్డి, పక్కీరుమల్లారెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ సామ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

అడ్డగూడూరు: మండలంలోని మానాయికుంటా, జానకీపురం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను అడ్డగూడూరు పీఏసీఎస్ చైర్మన్ కొప్పుల నిరంజన్‌రెడ్డి ప్రారంభించారు. పీఏసీఎస్ వైస్ చైర్మన్ చేడే చంద్రయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నిమ్మనగోటి జోజి, సీఈవో వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు కడారి శ్రీశైలం, అశోక్‌రెడ్డి, భిక్షం, భిక్షం పాల్గొన్నారు.

భువనగిరి రూరల్: మండలంలోని సిరివేణికుంటలో ఏర్పాటు చేసిన కొనుగోలు ధాన్యం కేంద్రాన్ని భువనగిరి పీఏసీఎస్ చైర్మన్ డాక్టర్ నోముల పరమేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ కేతావత్ మహేందర్ నాయక్, డైరెక్టర్లు బెల్లంకొండ సురేష్, గుమ్మడి సురేందర్‌రెడ్డి, గడ్డం ఎల్లమ్మ, సీఈవో ఎం.రామలింగచారి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లను వెంటనే ప్రారంభించాలి



వలిగొండ: ఆర్ఐకి వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

వలిగొండ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోళ్లను యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీజేపీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈసందర్భంగా జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం నట్టేట ముంచిందని విమర్శించారు. రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. రైతులను ఆదుకోవాలని కోరారు. అనంతరం మండల ఆర్ఐకి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బోళ్ల సుదర్శన్, సీఎస్.రెడ్డి, బందారపు లింగస్వామి, రాచకొండ కృష్ణ, కనతాల అశోక్‌రెడ్డి, బందారపు రాములు, కందుల తనీషా, బొడిగె ఆనంద్, పోలు నాగయ్య, మైసోళ్ల రామనర్సు, లోడె లింగస్వామి, గంగదారి దయాకర్, మందుల నాగరాజు, రామచంద్రం పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి: మండల కేంద్రంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు పాశం భాస్కర్, నాయకులు ఎన్నం శివకుమార్, చిక్క కృష్ణ, డబ్బికార్ సాయేష్‌కుమార్, మేకల రవీందర్‌రెడ్డి, నోముల గణేష్, గంజి.బస్వలింగం, చెరుకు వెంకటేశం పాల్గొన్నారు.

ఆలేరు: ఆలేరులో నిర్వహించిన ధర్నాలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చందా మహేందర్, నాయకులు పూజారి కుమారస్వామి, నంద గంగేష్, ఎస్. అమరేందర్, ఎలుగల వెంకటేష్, వడ్డేమాన్ నరేందర్, బందెల సుభాష్, తోట మల్లయ్య, వైస్ సురేష్, నర్సింహారెడ్డి, కుమ్మరిల్ల లక్ష్మి, శంకర్, రవి పాల్గొన్నారు.

బీబీనగర్: బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొప్పుల యాదిరెడ్డి, నాయకులు భువనగిరి సదానంద్ గౌడ్, గోపాల్‌రెడ్డి, ఇంజమూరి ప్రభాకర్, జంగారెడ్డి, లక్ష్మణ్, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట రూరల్: కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఫకీర్ రాజేందర్‌రెడ్డి, నాయకులు రచ్చ శ్రీనివాస్, నాయకులు గుంటిపల్లి సత్యానారాయణ, కర్రె ప్రవీణ్, మందోజు నరేష్, జిల్లా భానుచందర్, మహేష్ పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం): బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పన్నాల చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు జి.కాశీనాథ్, ఆర్. మత్స్యగిరి, బి.ఇంద్రారెడ్డి, బి.సత్యనారాయణ, డి.కుమారస్వామి, పి.ప్రశాంత్ పాల్గొన్నారు.